www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00



ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169



Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 204 | మంగళవారం | 21 జులై, 2026




## త్రిపుర డీజీపీ అనుమానాస్పద మృతి

- పోలీస్ ప్రధాన కార్యాలయ వాష్‌రూంలో ఉరేసుకున్న అనురాగ్ ధంకర్?
- హైకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు కోరిన సీపీఎం, కాంగ్రెస్
- ఘటనపై మేజిస్ట్రేట్ స్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశం

6

## ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యాయత్నం

- హైదరాబాద్‌లో సోదరుడి ఫ్లాట్‌లో అపస్మారక స్థితిలో గుర్తింపు
- సూసైడ్ నోట్ స్వాధీనం
- ఫోరెన్సిక్ నివేదికల కోసం ఎదురుచూపు
- బాధితుడిపై లైంగిక ఆరోపణల కేసు

2



# హిమాలయ రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

- జమ్మూకశ్మీర్‌లో రెండ్రోజుల్లో 23మంది మృతి.. ఏడుగురి గల్లంతు
- ఉత్తరాఖండ్‌లో 150 రహదారుల మూసివేత

6

హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా సోమవారం మరో 11 మంది ప్రాణాలు కోల్పోవడంతో గత రెండు రోజుల వ్యవధిలో మరణాల సంఖ్య 23కు చేరింది. పూంచ్, రాజౌరి జిల్లాల్లో మరో ఏడుగురు గల్లంతవగా, వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఉత్తరాఖండ్‌లో నిరంతర వర్షాల ప్రభావంతో నాలుగు జాతీయ రహదారులు సహా సుమారు 150 రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ వర్షాల ప్రభావం తీవ్రంగానే కనిపిస్తోంది. కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో విద్యాసంస్థలను మూసివేయగా, 36 రహదారులు దెబ్బతిన్నాయి. అదేవిధంగా 43 తాగునీటి పథకాలు, ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# నీట్ లీక్‌పై దద్దరిల్లిన పార్లమెంట్

## తొలిరోజే ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన.. పలుమార్లు వాయిదా

- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- పార్లమెంట్ ముట్టడికి యత్నించిన సీజేపీ కార్యకర్తలు, ఉద్రిక్తత

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే నీట్-యూజీ 2026 పేపర్ లీక్ అంశం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యవహారంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆందోళన చేపట్టడంతో కార్యకలాపాలు స్తంభించాయి. నినాదాలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన విపక్షాల ఆందోళనల కారణంగా ఇరు సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశమైన నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చ జరపాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. రామమందిరం విరాళాల వ్యవహారంపైనా సభ్యులు నినాదాలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నీట్-యూజీ 2026 పేపర్ లీక్ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సమస్య లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినదని అన్నారు. నిరసనకు దిగిన విద్యార్థులపై లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ప్రభుత్వం సమస్యను అణచివేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. లోక్‌సభలో ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని నిలిపివేసి సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనా ఆందోళనలు కొనసాగడంతో మరోసారి వాయిదా పడింది. మొత్తం ఆరు సార్లు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు లోక్‌సభను ముగించారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఆందోళనలు మొదలయ్యాయి. డీఎంకే సభ్యులు తమిళనాడు–కర్ణాటక జల వివాదంపై నిరసన తెలిపా రు. మొత్తం ఐదుసార్లు వాయిదా అనంతరం రాజ్యసభ కార్యకలాపాలు ముగిశాయి. ఇదిలాఉండగా, నీట్ పేపర్ లీక్‌పై నిరసనగా సీజేపీ నేతృత్వంలో వేలాది మంది ఆందోళనకారులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ముందుకు సాగిన వారిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. కొంతమంది ఆందోళనకారులు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజ్యాంగ క్లబ్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాస్త్రి భవన్ సమీపంలో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు.



## హింసాత్మకంగా సీజేపీ 'చలో సంసద్'

- 118మంది పోలీసులకు గాయాలు
- గాయపడినవారిలో పలువురు ఉన్నతాధికారులు
- పోలీసులపై రాళ్ల దాడి, ప్రభుత్వ వాహనాల ధ్వంసం
- 70 మందిపై కేసు నమోదు

2



## జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల భేటీ

3

డిమాండ్లను ప్రభుత్వ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ

## 56ఏళ్ల యువకుడి గురించి మాట్లాడట్లేదు!



- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని విమర్శలు
- స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్లకు ప్రశంస
- భారత్ ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త మైలురాయి సాధించిందని వెల్లడి

2

# పామాయిల్ రైతులకు భరోసా

- గిట్టుబాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది
- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అంజనాపురంలో గోద్రెజ్ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం



**ప్రజానావ, ఖమ్మం:** పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమని, ఆయిల్ పామ్ సాగు రైతులకు అధిక ఆదాయం అందించే పంటగా మారిందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌ను సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

తరువాయి 2లో..

# పేదల సొంతింటి కల సాకారం

## హైదరాబాద్ నగరంలోని క్యూర్ పరిధిలో ఇళ్ల స్థలాలు

- రూ.10వేలతో ప్లాట్లకు దరఖాస్తులు.. ఆగస్టు 10 వరకు గడువు
- డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక
- స్థలం కేటాయింపుతో పాటు రూ.5 లక్షల సాయం
- పదేళ్ల పాటు విక్రయాలు, అద్దెలకు ఇవ్వడం నిషేధం
- చివరి లబ్ధిదారునికి ఇల్లు అందేవరకు కొనసాగనున్న ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇళ్ల స్థలాల కోసం దరఖా స్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, మీసేవ, వాట్సాప్, అధికారి క వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. సోమవారం నాడు సచివాలయంలో సహచర మంత్రులు దు ద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులతో కలిసి క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిర మ్మ ఇళ్ల బ్రోచర్, మీసేవ, వాట్సాప్ దరఖాస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారు రూ.10 వేల టోకెన్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. లబ్ధిదా రుల ఎంపికను పూర్తిగా పారదర్శకంగా డ్రా పద్ధతిలో నిర్వ హిస్తామని, డ్రాలో ఇల్లు రాని వారి టోకెన్ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పారు. కేటాయించిన ఇళ్ల స్థలాలను పదేళ్ల పాటు విక్రయించడం, అద్దెకు ఇవ్వడం నిషేధమని మంత్రి స్పష్టం చేశారు. అయితే బ్యాంకు రుణం కోసం తనఖా పెట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేని పేదలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి తెలిపారు. లబ్ధిదారుల పేర్లపై స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తామని, స్థలంతో పాటు



తరువాయి 2లో..

# బాలింతల కన్నీళ్లు కనిపించడం లేదా?

- ప్రభుత్వాసుపత్రుల్లో కరువైన రక్షణ
- ఇందిరమ్మ పాలనలో బాలింతలకు భరోసా లేకుండా పోయింది
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బాన్సువాడ ఘటనపై ప్రభుత్వంపై ఆగ్రహం
- నిమ్స్‌లో బాలింతలకు పరామర్శ

**ప్రజానావ, హైదరాబాద్:** ఇందిరమ్మ పాలనలో బాలింతలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలింతలను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ ఘటన జరిగి పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు ప్రస్తుతం నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. వారిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని, తెల్ల రక్తకణాలు తగ్గడంతో పాటు కిడ్నీ, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసికందులకు కూడా ఇన్‌ఫెక్షన్ సోకిందని, నీలోఫర్ ఆస్పత్రిలో చిన్నారులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. బాలింతలు ఇంకా పూర్తిగా కోలుకోలేదని, పసికందులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఆరుగురు మహిళలకు ఈ నెల 10న ఇన్‌ఫెక్షన్ సోకిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయని తెలిపారు. ఆపరేషన్ థియేటర్ నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు చెబుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. కాలం చెల్లిన మందుల వినియోగం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని బాధితులు చెబుతున్నారని అన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు కనీసం బాధితులను పరామర్శించలేదని విమర్శించారు. ఒక బాధిత కుటుంబం నగలు అమ్మి, అప్పులు చేసి వైద్య చికిత్సలు చేయించుకోవాల్సి వచ్చిందని చెప్పిందన్నారు. ఇంతటి ఘటన జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు.

### బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేక శ్రద్ధ

మహిళల ఆరోగ్యంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని హరీశ్‌రావు అన్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, బాలింతలకు కేసీఆర్ కిట్లు అందించామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని, అమ్మ ఒడి వాహనాల ద్వారా బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రుల్లో మహిళలు, బాలింతలకు భరోసా కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యాయత్నం

- హైదరాబాద్‌లో సోదరుడి ఫ్లాట్‌లో అపస్మారక స్థితిలో గుర్తింపు
- సూసైడ్ నోట్ స్వాధీనం
- ఫోరెన్సిక్ నివేదికల కోసం ఎదురుచూపు
- బాధితుడిపై లైంగిక ఆరోపణల కేసు

**ప్రజానావ, హైదరాబాద్:** సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో సహ శిక్షణార్థి మహిళా ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నగరంలోని తన సోదరుడి నివాసంలో అపస్మారక స్థితిలో కనిపించిన ఆయనను వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఆయన ఏ పదార్థం తీసుకున్నారనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలిలో ఒక చేతిరాత లేఖ లభించిందని, దాని ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ట్రిక్ లావేజ్ నిర్వహించినప్పటికీ ఎలాంటి అసాధారణ అంశాలు గుర్తించలేదని వైద్యులు చెప్పారు. రక్తం, మూత్ర నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించామని, పూర్తి స్పృహలోకి వచ్చిన తర్వాతే అసలు పరిస్థితులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయన పడక పక్కన మద్యం సీసా, శానిటైజర్ సీసా లభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 30ఏళ్ల మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. గత జూన్ 23 నుంచి అసభ్యకర సందేశాలు పంపడం, అకాడమీలో అవమానకర వ్యాఖ్యలు చేయడం, తప్పుడు ఆరోపణలు చేయడం, జూలై 9న తనను గదికి బలవంతంగా తీసుకెళ్లి జుట్టు పట్టుకుని గొంతు నులిమేందుకు ప్రయత్నించడం, కత్తితో బెదిరించడం, జూలై 10న మరోసారి దాడి చేయడం వంటి ఆరోపణలను ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా తనకు తెలియకుండా వ్యక్తిగత వీడియో చిత్రీకరించి, బ్లాక్‌మెయిల్ చేసేందుకు తన భర్తకు పంపినట్లు కూడా ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మహిళ గౌరవాన్ని అవమానించడం, లైంగిక వేధింపులు, వెంటాడటం (స్టాకింగ్), సమాచార సాంకేతిక (ఐటీ) చట్టంలోని సంబంధిత నిబంధనల కింద జూలై 18న కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై ఎస్‌వీపీఎన్‌పీఏ అధికారులు కూడా అంతర్గత విచారణ ప్రారంభించారు. దర్యాప్తు అధికారుల ఎదుట హాజరు కావాలని సంబంధిత ట్రైనీ ఐపీఎస్ అధికారికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని సంబంధిత ట్రైనీ ఐపీఎస్ అధికారి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించారు. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేసినట్లు సమాచారం.

## మథుర ద్వారకాధీశ్ ఆలయంలో చోరీ

**మథుర:** ఉత్తరప్రదేశ్‌లోని మథురలో యమునా నది తీరాన ఉన్న ప్రముఖ ద్వారకాధీశ్ ఆలయంలో హుండీని పగులగొట్టి అందులోని నగదును ఓ గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. ఈ ఘటన ఆలయంలో అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. ఆలయ సిబ్బంది సోమవారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకోగా హుండీ తాళం పగిలి ఉండటాన్ని గుర్తించి వెంటనే కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీటీవీ దృశ్యాల ప్రకారం సుమారు 25–30 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ముందుగా చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని, ఇనుపరాడ్‌తో స్టీల్ హుండీని పగులగొట్టి నగదును బ్యాగ్‌లో వేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటన సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఇద్దరు పోలీసులు అక్కడి నుంచి వెళ్లినట్లు దృశ్యాల్లో కనిపించిందని ఆలయ అధికారులు తెలిపారు. హుండీలో ఎంత మొత్తం నగదు ఉందో ఇంకా నిర్ధారణ కాలేదని, సీసీటీవీ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని అదనపు ఎస్పీ రాజీవ్ కుమార్ సింగ్ వెల్లడించారు.

# 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడట్లేదు!

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని విమర్శలు
- స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్లకు ప్రశంస
- భారత్ ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త మైలురాయి సాధించిందని వెల్లడి




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్ష విమర్శలు చేశారు. భారత్ తొలి ప్రైవేటు కక్ష్యా రాకెట్ ప్రయోగ విజయాన్ని ప్రస్తావిస్తూ.. 'నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదు.. సగటు వయసు 28 ఏళ్లుగా ఉన్న యువ స్టార్టప్ బృందం గురించి చెబుతున్నా' అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు సోమవారం మీడియాతో మాట్లాడిన ప్రధాని.. గత నెల రోజుల వ్యవధిలో భారత్ అనేక విజయాలను సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా అంతరిక్ష రంగంలో దేశం కొత్త మైలురాళ్లను చేరుకుంటోందని తెలిపారు. ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రమ్–1 ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ విజయంతో అమెరికా, చైనాల తర్వాత ప్రైవేటు సంస్థల ద్వారా కక్ష్యా ప్రయోగ సామర్థ్యం సాధించిన మూడో దేశంగా భారత్ నిలిచిందని అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్‌లో పనిచేస్తున్న బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని ప్రధాని తెలిపారు. యువత ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యంతో భారత అంతరిక్ష రంగం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని కొనియాడారు. 'ఈ యువ ఆలోచనలే అంతరిక్ష రంగంలో భారత్ పతాకాన్ని ఎగురవేస్తున్నాయి. ఇది దేశానికి గర్వకారణం' అని మోదీ అన్నారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ప్రైవేటు సంస్థలు ఇలాంటి అంతరిక్ష సామర్థ్యాలను సాధించాయని, భారత యువ ఆవిష్కర్తలు దేశ ఆకాంక్షలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇదిలాఉంటే రాహుల్ గాంధీ జూన్ 19న 56వ పుట్టినరోజు జరుపుకున్న నేపథ్యంలో ప్రధాని చేసిన '56 ఏళ్ల యువకుడు' వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. యువత సాధిస్తున్న విజయాలు దేశంపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని, అంతర్జాతీయ స్థాయిలో భారత్ గౌరవం, విశ్వసనీయత మరింత బలపడుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



## భద్రాచలంలో ఘనంగా ముత్యంగి సేవ

- వైభవంగా శ్రీ సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**ప్రజానావ, భద్రాచలం:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం ముత్యంగి సేవ, నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం అర్చన, ఆరాధన, నివేదన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ప్రత్యేక సేవలో భాగంగా స్వామివారికి ముత్యాలతో పొదిగిన కవచాలను అలంకరించి ఘనంగా ముత్యంగి సేవ నిర్వహించి భక్తులకు దివ్య దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను వధూవరులుగా సుందరంగా అలంకరించి బేడ మండపానికి వేంచేపు చేసి, పుణ్యాహవాచనం, యోగ్యధారణ తదితర వైదిక కార్యక్రమాల అనంతరం నిత్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే. దామోదర్‌రావు, ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా, వేదపండితులు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హింసాత్మకంగా సీజేపీ 'చలో సంసద్'

- 118 మంది పోలీసులు, 60 మంది ఆందోళనకారులకు గాయాలు
- గాయపడినవారిలో పలువురు ఉన్నతాధికారులు
- పోలీసులపై రాళ్ల దాడి, ప్రభుత్వ వాహనాల ధ్వంసం
- 70 మందిపై కేసు నమోదు



**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన 'సంసద్ చలో' నిరసన కార్యక్రమం సోమవారం ఢిల్లీలో ఉద్రిక్తంగా మారింది. ఆందోళన హింసాత్మకంగా మారడంతో 118 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో పలువురు ఉన్నతాధికారులు, మహిళా పోలీసు సిబ్బంది కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి సుమారు 70 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీ ప్రాంతంలో జరిగిన ఈ నిరసన సందర్భంగా ఆందోళనకారులు పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసి నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని పోలీసులు ఆరోపించారు. ఆందోళనకారులు బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపుతప్పిందని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులపై రాళ్లు, ఇతర వస్తువులతో దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఆందోళనలో ప్రత్యేక పోలీసు కమిషనర్, జాయింట్ కమిషనర్, అదనపు కమిషనర్, డీసీపీ, అదనపు డీసీపీ, ఏసీపీ స్థాయి అధికారులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణలో సుమారు 60 మంది ఆందోళనకారులు కూడా గాయపడినట్లు వెల్లడించారు. గాయపడిన పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనల్లో 15 నుంచి 20 వరకు ప్రభుత్వ వాహనాలు, ఇతర ప్రభుత్వ ఆస్తులు ధ్వంసమైనట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆందోళనకారులు ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు శాంతిభద్రతలకు ముప్పు కలిగించేలా వ్యవహరించారని ఆరోపించారు. అదుపులోకి తీసుకున్న 70 మంది ఆందోళనకారులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

# అమ్మవారి అలక.. వైభవంగా హేరా పంచమి

- సోదరుడితో బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి తొమ్మిది రోజుల పాటు గుండిచా ఆలయంలో కొలువుదీరనున్న జగన్నాథుడు



**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం గుండిచా ఆలయంలో నిర్వహించిన 'హేరా పంచమి' వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జగన్నాథుడు, మహాలక్ష్మి అమ్మవారి మధ్య దివ్య అనుబంధం, అలకకు ప్రతీకగా ఈ సంప్రదాయాన్ని నిర్వహిస్తారు. రథయాత్రలో భాగంగా జగన్నాథుడు తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి తొమ్మిది రోజుల పాటు గుండిచా ఆలయంలో కొలువుదీరుతారు. తనను వెంట తీసుకెళ్లకుండా జగన్నాథుడు వెళ్లిపో యారనే భావంతో మహాలక్ష్మి అమ్మవారు అలక ప్రదర్శించడం 'హేరా పంచమి' వేడుకలో ప్రధాన ఘట్టంగా భావిస్తారు. సంప్రదాయం ప్రకారం జగన్నాథ ఆలయం నుంచి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకిలో ఊరేగింపుగా గుండిచా ఆలయానికి తీసుకువచ్చారు. జగన్నాథ ఆలయం నుంచి సుమారు 2.6 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకున్నప్పటికీ అమ్మవారు స్వామివారిని కలుసుకోరనే విశ్వాసం భక్తుల్లో ఉంది.

### నందిఘోష్ రథానికి ప్రతీకాత్మక స్పర్శ

హేరా పంచమి సంప్రదాయంలో భాగంగా మహాలక్ష్మి అమ్మవారు జగన్నాథుడి నందిఘోష్ రథాన్ని ప్రతీకాత్మకంగా తాకి తిరిగి వెళ్తారు. తనను వెంట తీసుకెళ్లనందుకు అమ్మవారి అలకకు ఇది సంకేతంగా భావిస్తారు. జగన్నాథ సంస్కృతి పరిశోధకుడు భాస్కర్ మిశ్రా మాట్లాడుతూ.. ఈ ఆచారం దైవిక ప్రేమ, విరహం, దాంపత్యంలోని అనురాగభరితమైన అలకను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా, జూలై 24న జరగనున్న బహుదా యాత్ర (తిరుగు రథయాత్ర)కు హేరా పంచమి వేడుకలతో సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గుండిచా ఆలయం వద్ద ఉన్న మూడు రథాలను తిరుగు ప్రయాణానికి సిద్ధం చేసే పనులు చేపట్టారు. భక్తుల భారీ రద్దీ నేపథ్యంలో గుండిచా ఆలయ పరిసరాల్లో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. అదనపు బలగాలను మోహరించి ట్రాఫిక్, భక్తుల రాకపోకలను నియంత్రిస్తున్నట్లు సెంట్రల్ రేంజ్ డీఐజీ సత్యజిత్ నాయక్ తెలిపారు.

# పేదల సొంతింటి కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 500 ఇళ్ల చొప్పున ప్రయోగాత్మకంగా నిర్మాణాలు ప్రారంభిస్తున్నామని చెప్పారు. త్వరలో మరో 8 నియోజకవర్గాలకు ఈ పథకాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను ప్రారంభిం చామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పేదలకు మొత్తం 8 లక్షల ఇళ్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గతంలో నగరానికి దూర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొ న్నారు. ప్రస్తుతం పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో పేదలకు అందించే ఇళ్ల స్థలాలు విలువైనవి గా ఉంటాయని, సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. రూ.40 నుంచి రూ.60 లక్షల వరకు విలువ చేసే స్థలాలను మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

### బోనాల నాటికి పూర్తి

హైదరాబాద్‌లో జరుగుతున్న బోనాల జాతర సందర్భంగా క్యూర్ పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే ఏడాది బోనాల నాటికి కొత్త ఇందిరమ్మ ఇళ్ల నుంచి పండుగ వేడుకలు నిర్వహించేలా నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పేదలకు సొంత ఇల్లు అందించే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం కొనసాగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చివరి అర్హుడికి ఇల్లు అందే వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

### నాగరాజుకు రూ.లక్ష బహుమతి

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరును ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సూచించిన నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన కొండా నాగరాజుకు మంత్రులు రూ.లక్ష నగదు బహుమతిని అందజేశారు. ఈ పథకానికి పేరు సూచించిన వారికి రూ.లక్ష బహుమతి ఇస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించగా, నాగరాజు సూచించిన పేరును ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మంత్రులు ఆయనను సత్కరించారు.

## పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చారిత్రాత్మక కార్యక్రమమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఉపయోగపడేలా చేయాలన్న ఉద్దేశంతో ప్రభు త్వం ముందుకు సాగుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం హౌసింగ్ కాలనీలు నిర్మించిందని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు ఎక్కువగా అద్దె ఇళ్లలో జీవిస్తున్నారని, వారికి స్థలం కల్పించి ఇళ్లు నిర్మించి ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హౌసింగ్ విభాగాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాము దానిని పునరుద్ధరించామని అన్నారు. మంత్రి మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ పరిధిలో పేదలకు ఇళ్ల నిర్మాణం



చేపట్టడం శుభపరిణామమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమ విషయంలో ప్రభుత్వం రాజీపడడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని బట్టి ప్రతి సోమవారం చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు. పేదలతో పాటు మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో ఉంచు కుందని, త్వరలో వారికి కూడా శుభవార్త అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ రైతులకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల కారణంగా రాలేకపోయారని, రైతులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారని చెప్పారు. అంజనాపురంలో ఆధునిక ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన గోద్రెజ్ సంస్థకు భట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభినందించారు. ఖమ్మం జిల్లా రైతులు అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నారని, అయితే ఆయిల్ పామ్ సాగు ద్వారా అత్యధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం లభిస్తోందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం ఈ పంట సమర్థంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో పామాయిల్‌కు భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ఉత్పత్తి తక్కువగా ఉందని భట్టి తెలిపారు. దేశానికి ఏటా సుమారు 25 లక్షల టన్నుల పామాయిల్ అవసరమవుతుండగా, ఉత్పత్తి కేవలం 12 లక్షల టన్నులకే పరిమితమైందన్నారు. 1992లో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు నేడు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిందని చెప్పారు. గతంలో టన్ను పామాయిల్‌కు రూ.12 వేల ధర ఉండేదని, ప్రస్తుతం అది రూ.23 వేలకు చేరిందని వెల్లడించారు. అంజనాపురంలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఎంతో మేలు చేస్తుందని, భవిష్యత్తులో ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా మారుతుందని తెలిపారు.

### 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగే లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గోద్రెజ్ సంస్థ ఏర్పాటు చేసిన ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం సంతోషకరమన్నారు. కంపెనీకి



అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. తెలంగాణలో ఇప్పటికే ఆయిల్ పామ్ సాగు వేగంగా విస్తరిస్తోందని, రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని తుమ్మల తెలిపారు. ఇప్పటికే మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పూర్తికాగా, మరో ఆరు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. దక్షిణ భారత రాష్ట్రాలన్నీ కలిసి పామాయిల్ దిగుమతులపై సుంకాలను తగ్గించాలని కేంద్రాన్ని కోరుతున్నాయని తుమ్మల తెలిపారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సహాయం అందిస్తూ ఆయిల్ పామ్ సాగును మరింత ప్రోత్సహిస్తామని చెప్పారు. తనకు 50 ఏళ్ల వ్యవసాయ అనుభవంలో ఏ పంటకూ రాని ఆదాయం ఆయిల్ పామ్‌తో లభించిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం సరైన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యానవన పంటల సాగును విస్తరించాల్సిన అవసరం ఉందని తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## బోనాల ఏర్పాట్లపై ఆలయాల పరిశీలన

**ప్రజానావ, ఖైరతాబాద్:** రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ ప్రాంతంలోని వివిధ దేవాలయాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిశీలించారు. మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, సంబంధిత శాఖ ఏఈ వెంకటేశ్‌తో కలిసి ఆలయాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు తదితర సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. సమస్యలపై స్పందించిన ఏఈ వెంకటేశ్ మాట్లాడుతూ.. ఆలయాల వద్ద గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎల్లయ్య, బోదాస్ నాగార్జున, మంజుల, సి. విజయరావు, విష్ణు, ఈశ్వర్, కనతల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.





# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజావాణిలో 175 దరఖాస్తుల రాక

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణి మొత్తం 175 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణికి ఆరు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నాలుగు ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ఎస్పీ సునిత రెడ్డి

**ప్రజానావ,ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె నేరుగా 17 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా మరియు వేగవంతంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించడంలో రాజీపడొద్దని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. కాగా, ఈరోజు అందిన ఫిర్యాదుల్లో 05 భూ వివాదాలు, 03 భార్యాభర్తల గొడవలు, 09 పరస్పర వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి. ఎస్పీ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు.

# సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- అలైన్‌మెంట్‌లో జిల్లా కేంద్రాన్ని మళ్లీ చేర్చాలని డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల భారీ ధర్నా



**ప్రజానావ, సూర్యాపేట:** హైదరాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను తిరిగి చేర్చి, జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి–65పై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణమని, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. వరి, పత్తి, ఎర్ర మిరప, జొన్న వంటి వ్యవసాయ పంటల ఉత్పత్తితో పాటు పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు, విద్యా సంస్థలు, పారిశ్రామిక రంగం అభివృద్ధితో సూర్యాపేటకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. గతంలో ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికీ ప్రస్తుతం పరిశీలనలో ఉన్న మూడో అలైన్‌మెంట్‌లో జిల్లా కేంద్రాన్ని తొలగించడం ద్వారా సూర్యాపేట ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా జిల్లాకు రైల్వే మార్గం కోసం ప్రజలు నిరంతరం పోరాటం చేస్తున్నారని, ఐదు దశాబ్దాలుగా రైల్వే సౌకర్యం కోసం ఎదురు చూస్తున్న సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కూడా దూరమైతే జిల్లా అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సూర్యాపేట ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో జిల్లా కేంద్రాన్ని చేర్చి స్టేషన్ ఏర్పాటుకు సిఫారసు చేయాలని కోరారు. సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించడం ద్వారా జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమం లో సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరెడ్డి, అఖిలపక్ష పార్టీల నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, మల్లు నాగార్జునరెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, మండారి డేవిడ్‌కుమార్, కొత్తపల్లి శివకుమార్, తుక్కాని మన్మథరెడ్డి, పెద్దిరెడ్డి రాజా, అనుముల రవిబాబు, నూకల సుదర్శన్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బండపల్లి పాండురంగాచారి, చల్ల మల్ల నరసింహ, తల్ల మల్ల హసేన్, రమణాచారి, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** నగరంలో ప్రత్యేక ఓటరు సవరణ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్పొరేటర్లందరూ తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రజలతో సర్ ఫారాలను నింపించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

# అంతర్రాష్ట్ర దేవాలయ దొంగల ముఠా అరెస్ట్

- తెలంగాణ - ఆంధ్రప్రదేశ్‌లో వరుస చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులు పట్టివేత
- బంగారం, వెండి ఆభరణాలు, వాహనాలు, చోరీ పరికరాల స్వాధీనం



**ప్రజానావ, ఖమ్మం:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దేవాలయ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఖమ్మం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. షేక్ జానీ అలియాస్ జానీ షరీఫ్, పేరాల నరసింహారావు అలియాస్ బాబీ, అర్వ ఉదయ్‌కుమార్ అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నేరాలకు ఉపయోగించిన వాహనాలు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఖమ్మం జిల్లా వీఎం బంజర పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం, జూలై 19 సాయంత్రం నిందితులు నాలుగు చక్రాల వాహనం, ద్విచక్ర వాహనంలో దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలను విక్రయించేందుకు తిరువూరు వెళ్తుండగా సీతారామపురం నూతన జాతీయ రహదారి సమీపంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. సాక్షుల సమక్షంలో విచారించగా పలు దేవాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. విచారణలో ముగ్గురు నిందితులూ పాత నేరస్థులేనని తేలింది. షేక్ జానీ, అర్వ ఉదయ్‌కుమార్‌లపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమూహ దోపిడీ కేసు నమోదై ఉండగా, షేక్ జానీపై కొత్తగూడెం టూ టౌన్, పాల్వంచ, ఇల్లందు పోలీస్‌స్టేషన్లలో ఇళ్ల దొంగతనాల కేసులు ఉన్నాయి. పేరాల నరసింహారావుపై హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఐదు దొంగతనం కేసులతో పాటు ములకలపల్లి, నేలకొండపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని గోకవరం పోలీస్ స్టేషన్లలో దేవాలయ చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ ముఠా జూన్ చివరి వారం నుంచి జూలై వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడింది. కొత్తగూడెం హనుమాన్ దేవాలయం, పెనుబల్లి మండలం ఉప్పల్‌చెలక రామాలయం, తల్లాడ మండలం అంజనాపురం హనుమాన్ దేవాలయం, కల్లూరు మండలం గనియా తండా హనుమాన్ దేవాలయం, వేంసూర్ మండలం లింగపాలెం హరిహర క్షేత్రం, ఆంధ్రప్రదేశ్‌లోని గోకవరం గంగాలమ్మ ఆలయం, పెనుబల్లి మండలం బయన్న గూడెం దేవాలయంలో బంగారు, వెండి ఆభరణాలు, కిరీటాలు, నేత్రాలు, హారాలు, హుండీల్లోని వస్తువులను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి మొత్తం 24 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,536 గ్రాముల వెండి వస్తువులు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం, చోరీలకు ఉపయోగించిన ఇనుప రాడ్, సుత్తి, పట్టుకారు, మరలు విప్పే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీఎం బంజర పోలీసులు దేవాలయ కమిటీలకు కీలక సూచనలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయాల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఆధునిక సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# వాంగ్‌చుక్ ప్రాణరక్షణే తొలి ప్రాధాన్యం

- స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్టు
- పూర్తి వైద్య నివేదికలు సమర్పించాలని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి ఆదేశం
- ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపుపై నేడు నిర్ణయం

**న్యూఢిల్లీ:** నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ప్రాణాలను కాపాడటమే ప్రస్తుతం కోర్టు ప్రధాన ఆందోళన అని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలంటూ భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, వాంగ్‌చుక్‌కు సంబంధించిన అన్ని పాథాలజీ నివేదికలు, వైద్య బులెటిన్లను అఫిడవిట్‌తో సహా సమర్పించాలని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిని ఆదేశించింది. సోమవారం నిర్వహించిన పరీక్షల ఫలితాలను కూడా నివేదికలో చేర్చాలని సూచించింది. ఎయిమ్స్ వైద్యులు కూడా మంగళవారం విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. గీతాంజలి తరఫు న్యాయవాది అఖిల్ సిబల్ మాట్లాడుతూ, ఎలాంటి అత్యవసర పరిస్థితి లేకుండానే వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆస్పత్రికి తరలించారని, ఆయనకు నచ్చిన ఆస్పత్రిలో చికిత్స పొందే హక్కు ఉందని వాదించారు. దీనికి కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు. పూర్తి వైద్య నివేదికలు పరిశీలించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంటూ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.




# హార్ముజ్‌లో నౌకలపై వరుస దాడులు

- యూఏఈ తీరానికి సమీపంలో మరో ఘటన
- అప్రమత్తమైన నౌకాయాన వర్గాలు
- ఒమన్ తీరంలో ప్రొజెక్టైల్ దాడి.. మంటల్లో చిక్కుకున్న నౌక
- వ్యూహాత్మక జలమార్గంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం



**దుబాయ్:** వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో నౌకలపై దాడుల పరంపర కొనసాగుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తీరానికి సమీపంలో సోమవారం సాయంత్రం మరో నౌకపై దాడి జరిగినట్లు బ్రిటన్‌కు చెందిన యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. అంతకుముందు ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై ప్రొజెక్టైల్ దాడి జరగడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం అనంతరం నౌక సిబ్బంది సురక్షితంగా బయటకు వెళ్లిపోగా, ఆ నౌక కొన్ని గంటల పాటు సముద్రంలో మంటలతోనే తేలియాడినట్లు సమాచారం. ఇరాన్ ఆధీనంలోని హార్ముజ్ జలసంధికి దూరంగా ప్రయాణించాలని అమెరికా సైన్యం నౌకలకు సూచించిన మార్గంలోనే ఈ ఘటనలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన ఈ జలమార్గంలో భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. మరోవైపు, జలసంధిలో ప్రయాణించే చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించినట్లు సమాచారం. తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జేపీ నడ్డాతో సీజేపీ ప్రతినిధుల భేటీ

- డిమాండ్లను ప్రభుత్వ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా, సోనం వాంగ్‌చుక్ విడుదలకు విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** పోటీ పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ ఆందోళనలు చేపడుతున్న కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సోమవారం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య జరిగిన తొలి ప్రత్యక్ష చర్చల్లో భాగంగా ఆందోళనకారుల డిమాండ్లను ప్రభుత్వ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి అంతర్గతంగా చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సీజేపీ ప్రతినిధులు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లు నడ్డాను రెండుసార్లు కలిసి తమ వినతిపత్రాన్ని సమర్పించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్‌ను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కోరారు. అలాగే నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనతో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ, తమ డిమాండ్లపై ప్రభుత్వ ఉన్నత నాయకత్వంతో చర్చించి నిర్ణయం తెలియజేస్తామని జేపీ నడ్డా చెప్పారని వెల్లడించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీ లేదా నిర్ణయం వెలువడలేదని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు బలప్రయోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు.

# నిరసనకారులపై లాఠీచార్జి దుర్మార్గం

సీపీఐ ఎంఎల్ మాస్ లైన్

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్ చుగ్, ఇతర నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సి. హనుమంతు మాట్లాడుతూ.. లడక్ పర్యావరణ పరిరక్షణ కోసం, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తున్న వారిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్, గణేష్, రాజన్న, గీతాబాయి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు దినేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాం

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరు
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో అక్రమాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల జోలికి వస్తే ప్రజలే ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యా కమిషన్ నివేదిక పేరుతో రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన ప్రారంభం నుంచే వ్యతిరేకిస్తోందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ.146 కోట్ల చొప్పున మొత్తం 72 పాఠశాలల కోసం సుమారు రూ.11 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం చెబుతోందని, అయితే వాటిలో సగానికి పైగా పనులను మేఘా, కేఎంవీ సంస్థలకే అప్పగించారని ఆరోపించారు. ఈ సంస్థలు ఐదు శాతం అధిక ధర కోట్ చేయడంతో ప్రభుత్వంపై రూ.600 కోట్లకు పైగా అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలో ఈ పాఠశాలల నిర్మాణం పూర్తవడం సాధ్యం కాదని, ఒక్కో పాఠశాల నిర్మాణానికే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుందని కవిత అన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పాఠశాలలు నిర్మిస్తే విద్యార్థుల రవాణా కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, ఆ పనులను కూడా అదే సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. గ్రామాల్లో కార్పొరేట్ పాఠశాలలకు రెడ్ కార్పెట్ పరుస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బడ్జెట్ పాఠశాలలకు ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయకుండా వాటిని మూసివేత దిశగా నెడుతున్నారని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో జరిగిన అవకతవకలపై ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీకి చెందిన వెలుగు పత్రికలోనే టెండర్లలో జరిగిన గోల్‌మాల్‌పై కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. గుడి ఎంత ముఖ్యమో బడి కూడా అంతే ముఖ్యమని చెప్పిన ఆమె, పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు దాటినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫారాలు అందలేదని విమర్శించారు. ప్రభుత్వం పాఠశాలల సంఖ్యను తగ్గించాలని భావిస్తే ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటని, భవిష్యత్తులో కొత్తగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను తెలంగాణ రక్షణ సేన ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేసిన కవిత, మధ్యాహ్న భోజన పథకంలో ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం కేవలం రూ.6 మాత్రమే చెల్లిస్తుండగా మార్కెట్‌లో గుడ్డు ధర రూ.8గా ఉందని గుర్తు చేశారు. విద్యార్థులకు వారానికి మూడు రోజుల బదులు ఐదు రోజులు గుడ్డు అందించాలని, గుడ్డు ధరను రూ.8కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు కావడం లేదని, యూనిఫారాల పంపిణీ కూడా పూర్తికాలేదని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో దూర ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేస్తే ముఖ్యంగా బాలికలు నష్టపోతారని, తల్లిదండ్రులు తమ పిల్లలను దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు పంపేందుకు వెనుకాడతారని అన్నారు. అందువల్ల ప్రతి గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలు కొనసాగాలని, గ్రామ సర్పంచ్‌లు కూడా ఈ అంశంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితిలో ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు.

## పీవీ సింధూకు కవిత అభినందనలు

థ్యాంక్స్ అక్క అంటూ స్పందించిన: పీవీ సింధు

జపాన్ ఓపెన్ సూపర్–750 టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలైన స్టార్ షట్లర్ పీవీ సింధూకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. లింక్డ్‌ఇన్ వేదికగా ఆమె చేసిన పోస్టులో సింధూ పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని ప్రశంసిస్తూ, క్లిష్ట పరిస్థితులను అధిగమించి తిరిగి అగ్రస్థానానికి చేరుకోవడం ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కష్టకాలంలో క్రీడాకారులకు అండగా నిలవడమే నిజమైన క్రీడాస్ఫూర్తి అని ఆమె అన్నారు. దీనిపై స్పందించిన పీవీ సింధూ థ్యాంక్స్ అక్క అంటూ కృతజ్ఞతలు తెలిపారు. తాను గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, విజయాల సమయంలోనూ కవిత తనకు ఎప్పుడూ ధైర్యం చెప్పి ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఆమె మద్దతు తనకు ఎంతో బలాన్ని ఇచ్చిందని సింధూ వెల్లడించారు. ఇద్దరి మధ్య జరిగిన ఈ పరస్పర స్పందన సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షించింది.





# వర్షాభావ నివారణకు వరుణ యాగం ప్రారంభం

- యాదగిరిగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పం

**ప్రజానావ, యాదగిరిగుట్ట:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తొలగి రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వర్ష పాశుపత వరుణ యాగాన్ని ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో నెలకొన్న అనావృష్టి పరిస్థితులు తొలగి రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, విశ్వశాంతి నెలకొనాలని సంకల్పించి ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక యాగాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. యాగ కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, పంచగవ్య ప్రాశనం తదితర వైదిక కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ సురేందర్‌రెడ్డి, అర్చకులు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు. యాగం విజయవంతంగా నిర్వహించి రాష్ట్రానికి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇదిలా ఉండగా, భక్తుల నుంచి ఒక్కరోజులో రూ.15,50,949 ఆదాయం సమకూరగా, ఆ మొత్తాన్ని స్వామివారి ఖజానాలో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



EDITORIAL

# ప్రజాగొంతుకపై అంకుశం!

> రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు. ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు.

దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు. ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికి, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియుతంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థపరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలో వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించవచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను డా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదిజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాలపై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు డా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

> వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించా రన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివి డత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు.

# ఎల్‌నినోను క్షేత్రస్థాయి వాస్తవాలతోనే ఎదుర్కోవాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వర్షాభావ పరిస్థితులపై ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్ష
- తాగునీటికే తొలి ప్రాధాన్యం
- వరికి దూరంగా ఉండాలని రైతులకు సూచన




**ప్రజానావ, ఖమ్మం:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం కలెక్టర్ దివాకర్ టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, త్రాగునీరు, సాగునీరు, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇవ్వగా, జూలై మధ్య నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం రైతులు అధికంగా పత్తి సాగు చేశారని, వర్షాలు కురిస్తే వరి సాగు చేయాలని భావిస్తున్నారని, భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాల్లో వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రానున్న రెండు నెలల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాల్లో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల ప్రధాన ఉద్దేశం క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకొని ముందస్తు చర్యలు చేపట్టడమేనని చెప్పారు. నీటిపారుదల, ప్రణాళిక, వ్యవసాయం, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేసి ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. వర్షపాతం లోటు, దాని ప్రభావంపై ప్రతి రైతుకు స్పష్టమైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వద్ద ఉన్న వాస్తవ సమాచారం క్షేత్రస్థాయికి చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. గతేడాది, ఈ ఏడాది జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించి మీడియా, అధికారులు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించవచ్చనే అంశంపై తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు అందే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి అవసరమైన చోట ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యతను బట్టి మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. పెసర, మినుములు, కందులు, అలసంద, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి సమస్య మరింత తీవ్రం అయ్యే అవకాశమున్నందున బోర్ల ఆధారంగా వరి సాగు చేయవద్దని హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ అంచనాలు, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, రైతు వేదికల ద్వారా ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వివరించాలని మంత్రి ఆదేశించారు. నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి సాగు చేస్తే ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే రైతులకు తెలియజేయాలని సూచించారు. గోదావరి బ్యాక్‌వాటర్‌ను వినియోగించి సాధ్యమైనన్ని చెరువులను నింపేందుకు అవసరమైన మోటార్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వైరా, లంకాసాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నామని, పాలేరు జలాశయంలో కూడా పరిమిత కాలానికే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందన్నారు. రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను పాలేరు జలాశయానికి తరలించే అవకాశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మూడు నెలలకే పరిమితం కాకుండా కనీసం ఏడాది అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆగస్టు నుంచి ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్ దివాకర్ టి.ఎస్. కలిసి ఎల్‌నినో పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్‌బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ సోమవారం 20న ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.. ఊర్కొండ పీఎస్‌లో పనిచేస్తూ మరణించిన హోంగార్డ్ బాలయ్య కుటుంబానికి రూ. లక్ష, కోడేరు పీఎస్‌లో పనిచేస్తూ చనిపోయిన బయన్న కుటుంబానికి రూ. 94 వేల చొప్పున సాయాన్ని అందజేశారు. జిల్లా సాయుధ సిబ్బంది, హోంగార్డులు కలిసి ఈ మొత్తాన్ని రూ. 1,94వేలు జమ చేశారు. వీటికి అదనంగా జిల్లా పోలీస్ వెల్ఫేర్ నుంచి మరో రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని ఎస్పీ చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ పాలసీలు తీసుకోవాలని, ఇవి విపత్కర పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవరావు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, శివాజీ, గౌస్ పాషా, హోంగార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- బుస్సాపూర్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు
- మెనూ అమలు, పరిశుభ్రతపై కలెక్టర్ హైమావతి ఆదేశాలు



**ప్రజానావ, సిద్దిపేట:** విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించినా, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించిన వెజిటేబుల్ బిర్యానీ, గుడ్డు, టమాట – కందిపప్పుతో తయారుచేసిన సాంబారును పరిశీలించిన కలెక్టర్ ఆహార నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఇష్టానుసారంగా వంటలు తయారు చేస్తే సహించబోమని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని గుర్తించి, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణ కోసం వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వెజిటేబుల్ బిర్యానీ వండాల్సి ఉండగా అన్నం, సాంబారు మాత్రమే అందించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాష్‌బేసిన్ వద్ద నీరు లీకవుతున్న విషయాన్ని గుర్తించి పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతు చేయాలని, పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. తదనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, రోజువారీ మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆరా తీసి, ఎస్ఐఆర్ ఫారాల డిజిటైజేషన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచన




**ప్రజానావ, సంగారెడ్డి:** ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, జిల్లాల వారీ అమలు తీరును సమీక్షించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎల్‌నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అయినప్పటికీ, ముందస్తు ప్రణాళికతో నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రభావం వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల్లో కంది సాగు చేయవచ్చని పేర్కొన్న మంత్రి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రైతుల్లో అవగాహన పెంచేందుకు వీడియో రీల్స్, నాటకాలు, కళాజాతాలు, ఇతర ప్రచార మాధ్యమాలను విస్తృతంగా వినియోగించాలని చెప్పారు. జిల్లాల్లో కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటే రైతులు పంటల మార్పిడికి మరింత ఆసక్తి చూపుతారని అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రత పెరిగితే నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు చర్యలను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పశువులకు మేత కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సీజనల్ వ్యాధుల నివారణకు ఆరోగ్య శాఖ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినోను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం అన్ని శాఖలను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం మంత్రి జలసిరి ప్రచార పోస్టర్లు, జిల్లా కంటింజెన్సీ ప్లాన్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జలాశయాల్లో నీటి లభ్యత, విద్యుత్, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై వివరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## వరి తగ్గించండి.. తోటపంటలు వేయండి

- ఎల్‌నినో సమీక్షలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే హార్టికల్చర్ ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సూచించారు. సోమ వారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన ఎల్ నినో పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడు తూ.. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నా య పంటలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంతా ల్లో ఉపాధి కోల్పోకుండా 'ఉపాధి హామీ' కింద అదనపు పనిదినాలు కల్పించాలని, చెరువుల్లో నీటిని నిల్వ చేయాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తుగా మేత విత్తనాలు పంపిణీ చేయాలని, నష్ట నివారణకు రైతులు తప్పనిసరిగా పంట బీమా చేసుకోవాలని కోరారు. ఈ సమావే శంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## షిఫా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** జిల్లా కేంద్రంలోని రెండో రైల్వే గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'షిఫా మల్టీ స్పెషాలిటీ & చిల్డ్రన్ హాస్పిటల్'ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఎం.డి. షఫీక్.. ఎమ్మెల్యేను, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇదే వేదికపై డాక్టర్ షఫీ కుమార్తె జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సమక్షంలో చిన్నారితో కేక్ కట్ చేయించి, ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.






## ఎస్ఆర్పి–3 గనిలో స్క్రాప్ దొంగతనం యత్నం భగ్నం

- చాకచక్యంగా వ్యవహరించిన సింగరేణి సెక్యూరిటీ, ఎంటీఎఫ్ సిబ్బంది
- ఆటో స్వాధీనం.. పోలీసులకు ఫిర్యాదు

**ప్రజానావ, శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి–3 భూగర్భ గనిలో స్క్రాప్‌తో పాటు విలువైన విద్యుత్ కేబుళ్లను దొంగిలించేందుకు చేసిన యత్నాన్ని సింగరేణి సెక్యూరిటీ, మొబైల్ టాస్క్‌ఫోర్స్ (ఎంటీఎఫ్) సిబ్బంది భగ్నం చేశారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గనిలోకి చొరబడి ఇనుప స్క్రాప్‌తో పాటు విలువైన కేబుళ్లను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. విధుల్లో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే ఎంటీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోగా దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం గని పరిసరాల్లో తనిఖీలు చేపట్టగా ప్రహరీ గోడ సమీపంలో సుమారు 60 మీటర్ల డ్రిల్ కేబుల్ లభ్యమైంది. ఇదే సమయంలో బంకర్లపై ఉన్న ఎస్‌డీఎల్ కేబుల్ కనిపించడం లేదని ఉద్యోగులు సమాచారం ఇవ్వడంతో ఎంటీఎఫ్ సిబ్బంది గని పరిసరాలను మరింత క్షుణ్ణంగా గాలించారు. సోమవారం తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో ఎస్ఆర్పి–3 గని మెయిన్ సబ్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ ఆటోను గుర్తించి వెంబడించారు. ఈ క్రమంలో దొంగలు ఆటోను వదిలేసి పరారవగా, సింగరేణి సిబ్బంది ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేములవాడ రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు రూ.7,01,116 విరాళం



**ప్రజానావ, వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు వేములవాడ సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీ పసుల లక్ష్మీ నారాయణ, శ్రీమతి జనాబాయి దంపతులు రూ.7,01,116 (ఏడు లక్షల ఒక వేయి నూట పదహారు రూపాయలు)లను భక్తిశ్రద్ధలతో విరాళంగా అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో విరాళాన్ని అందజేసిన అనంతరం, భక్తుడు పసుల లక్ష్మీ నారాయణ స్వామివారి సేవలో భాగస్వామ్యం కావడం పట్ల భావోద్వేగానికి లోనై ఆనందభాష్పాలు పెట్టుకున్నారు. అన్నదాన సేవకు విరాళం సమర్పించగలిగినందుకు స్వామివారి అనుగ్రహాన్ని స్మరించుకుంటూ తన భక్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతలకు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్, అకౌంట్స్ అడ్వైజర్ ఆగం రావు, రాకేష్, రమాదేవి తదితర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేసిన దాతలను ఆలయ అధికారులు అభినందిస్తూ, వారి కుటుంబ సభ్యులకు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దివ్య అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## గడిచిన 20 రోజుల్లో జిల్లాలో పనిలో ఉన్న 61 మంది పిల్లల గుర్తింపు

- 18 ఏండ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 17 కేసులు నమోదు
- ఆపరేషన్ ముస్కాన్ టీమ్ అధికారులతో సమీక్ష సమావేశం



**ప్రజానావ, సిరిసిల్ల :** ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం పోలీసు శాఖతో పాటు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా పనిచేయాలని, ప్రతి తనిఖీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు ఎస్పీ డి చంద్రయ్య ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యలయంలో అపరేషన్ ముస్కాన్ టీమ్ లో ఉన్న అన్ని శాఖల అధికారులతో అదనపు ఎస్పీ చంద్రయ్య సమీక్ష సమావేశం నిర్వహించరు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ...ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలోని పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బాల కార్మికులు లేదా తప్పిపోయిన బాలలను గుర్తించి, వారికి తగిన రక్షణ కల్పించి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు చేర్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివిధ డిపార్ట్మెంటు అధికారులతో జిల్లాలో టీమ్‌లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా గడిచిన 20 రోజులలో 61 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని,18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 17 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిసిర్బి డిఎస్పీ భాస్కర్, డి డబ్ల్యూఓ లక్ష్మీ రాజం, ఎస్ఐలు ప్రేమనందం, లాక్పతి, వివిధ శాఖ ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రీవెన్స్ డేలో 36 ఫిర్యాదులు

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుంద న్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## సీసీఐ పునరుద్ధరణకు ఐక్యంగా ఉద్యమించాలి

- కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది
- మాజీ మంత్రి జోగు రామన్న పిలుపు



**ప్రజానావ, ఆదిలాబాద్:** మూతపడిన సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం అన్ని వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. సీసీఐ పునరుద్ధరణ, ప్రస్తుత పరిణామాలు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సుందరయ్య భవనంలో నిర్వహించిన చర్చాగోష్టిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మేధావులు, కళాకారులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని సీసీఐ పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ గతంలో కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహీర్, అప్పటి బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల సందర్భంగా సీసీఐ పునరుద్ధరణపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 13 సంవత్సరాలు గడిచినా సీసీఐ పునరుద్ధరణపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ టీఎస్–ఐపాస్ ద్వారా కొత్త పరిశ్రమలకు ఇస్తున్న రాయితీలను మూతపడిన సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభానికి కూడా వర్తింపజేస్తామని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. సీసీఐని 51 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 49 శాతం కేంద్ర ప్రభుత్వం వాటాలతో నిర్వహించేలా అంగీకరించాలని కోరుతూ లేఖలు కూడా పంపించినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర నాయకులు పలు హామీలు ఇచ్చినా వాటిని అమలు చేయలేదని పేర్కొన్నారు. 2022లో సీసీఐ సాధన సమితి ఏర్పాటు చేసి పరిశ్రమ పునఃప్రారంభం కోసం నిరంతరం ఉద్యమిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో–కన్వీనర్ నారాయణ, బండి దత్తాత్రి, నగేష్, సంగెపు బొర్రన్న, మంజుల, స్వప్న, కిరణ్, సచిన్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఉత్తమం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి
- ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష
- తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి పెట్టాలని రైతులకు సూచన




**ప్రజానావ, కామారెడ్డి:** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి సూచించారు. గ్రామీణ స్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించి, పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్‌రెడ్డి, తోట లక్ష్మీ కాంత్‌రావు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి, మేయర్ కే. ఉమారాణి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఎస్పీ రాజేష్ చంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు. సమావేశంలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్, పోచారం తదితర జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, విద్యుత్ అవసరాలు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్‌పామ్, కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిరక్షిస్తూ తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితి, నీటి లభ్యతపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించి ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని చెప్పారు. తీగజాతి కూరగాయలు, పాడి పరిశ్రమకు రాయితీలు, సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోం దని తెలిపారు. ఎమ్మెల్సీ బి. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పంటల వైవిధ్యాన్ని పాటించడం ద్వారా రైతులు నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా భూగర్భ జలాల పెంపు కోసం సోక్‌పిట్స్, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, ఉద్యాన పంటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనే చర్యలపై తమ సూచనలు చేశారు.

## విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు కలలు కనాలి

- విద్యార్థుల కదలికలపై అధ్యాపకులు నిరంతరం నిఘా ఉంచాలి
- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మాధకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకై కలలు కనాలని, ఆ కలల సాధనకై నిత్యం శ్రమించాలని విద్యార్థులకి సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. సోమవారం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ కళాశాల లో తెలంగాణ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాధకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకై నిత్యం శ్రమించాలని సూచిం చారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధ్యాపకులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఈగల్ టీమ్ డిఎస్పీ ఉపేందర్, ఎస్ఐ ఉపేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## మహా వజ్రేశ్వరిగా భద్రకాళి అమ్మవారికి విశేష పూజలు



**ప్రజానావ, వరంగల్ :** శ్రీ భద్రకాళీ అమ్మవారి ఉత్సవమూర్తులకు సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఇచ్ఛాశక్తి స్వరూపిణిగా కాళీ క్రమాన్ని అనుసరించి విప్రచిత్తా నిత్యారూపంలో, షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తి స్వరూపిణిగా మహా వజ్రేశ్వరిగా అమ్మవారిని అంకరించి పూజా రాధనలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానా ర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. మానవ జన్మ ఎంతో పుణ్యఫలితంగా లభిస్తుందని, పరోపకారార్థమిదం శరీరం అనే శాస్త్రవాక్యం ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పరులకు ఉపకారం చేయాలంటే జ్ఞానం, ఐశ్వర్యం, అధికారం లేదా వృత్తి నైపుణ్యం అనే నాలుగు అంశాల్లో కనీసం ఒకటి అయినా ఉండాలని, ఇవన్నీ నిరంతర సాధన, కఠోర శ్రమ ద్వారానే సిద్ధిస్తాయని పేర్కొన్నారు. సాధకుడు ఆధ్యాత్మిక మార్గంలో స్థిరంగా కొనసాగాలంటే అసురీ శక్తులు దూరం కావాల్సి ఉంటుందని, అందుకు జగన్మాత అనుగ్రహమే ఆధారమని చెప్పారు. మహావజ్రేశ్వరీ మాత భక్తుని సంకల్పాలను వజ్రసంకల్పాలుగా దృఢపరచి సాధనలో విజయవంతుడిని చేస్తుందని, అనంతరం అతడు తనతో పాటు మరెందరికో మార్గదర్శకుడిగా నిలిచి లోకకళ్యాణానికి దోహదపడతాడని వివరించారు. జగన్మాత ఆరాధన ద్వారానే ఈ ఆధ్యాత్మిక పరిపక్వత సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం అసహనం

- పెండింగ్ ఫిర్యాదులపై అధికారులకు బల్దియా కమిషనర్ వెంకన్న హెచ్చరిక
- ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశం



**ప్రజానావ, వరంగల్:** ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వరంగల్ బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను హెచ్చరించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి స్థానిక సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిన కమిషనర్, వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. అనంతరం పన్నులు, శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని, ప్రతి వారం అందిన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదు పెండింగ్‌లో ఉండకుండా అధికారులు ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల లాగిన్‌లలో ఫిర్యాదులు పేరుకుపోకుండా వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఇటీవల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లకు శానిటేషన్ నిర్వహణపై ఇచ్చిన సూచనలను తూచా తప్పకుండా అమలు చేయాలని, శానిటేషన్ అంశాలపై పూర్తి అవగాహనతో నిరంతరం సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ శాఖకు 58, ఇంజినీరింగ్ శాఖకు 38, రెవెన్యూ శాఖకు 13, హెల్త్–శానిటేషన్ శాఖకు 9, నీటి సరఫరా శాఖకు 9, హార్టికల్చర్ శాఖకు ఒకటి చొప్పున దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనల్ ఎస్ఈ రాజ్‌కుమార్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, హెచ్‌వో లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## యూఏఈలో ఘనంగా బోనాల వేడుకలు

**ప్రజానావ, కరీంనగర్ :** యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్స్‌లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైత్రి గ్రూప్స్ వ్యవస్థాపకుడు కొత్త జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విదేశాల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. దుబాయ్, అబుదాబి, షార్జా తదితర ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాసులు కుటుంబాలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, మహాహారతి, ఒగ్గు డోలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విదేశాల్లోనూ స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతి కలిగిందని ప్రవాసులు నిర్వాహకు లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎలిగేటి, ప్రధాన కార్యదర్శి రాణి కొట్ల, సంయుక్త కార్యదర్శి శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు బీరెల్లి, మాజీ అధ్యక్షులు రాధారపు సత్యం, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఎస్.పీ. కస్తూరి, సురేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వినోద్ ఆచారి, రఘు ఎలిగేటి, రాము కందుకూరి, సామ శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ పోలంపల్లి, కిరణ్ చెట్టిగారి, సారిక పీచర, మమత కస్తూరి, అన్నపూర్ణ, మౌనిక గౌడ్, మధు కుమార్, వనజ గోగుల, రనీషా, విపుల, స్వప్న, దీపిక తదితరులు, మహిళా విభాగ సభ్యులు, వాలంటీర్లు మరియు యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఎస్ఎన్ కంపెనీ భూముల వ్యవహారంపై మరోసారి ఫిర్యాదు

- అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని వినతి
- పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ప్రజాప్రతినిధుల ఆవేదన



**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బిక్కనూరు గ్రామ శివారులోని ఎంఎస్ఎన్ కంపెనీ పరిధిలో ఉన్న అసైన్డ్ భూముల వ్యవహారంపై గ్రామ ప్రజాప్రతినిధులు మరోసారి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. భూముల యాజమాన్యం, వినియోగం, రెవెన్యూ రికార్డుల్లో జరిగిన మార్పులు తదితర అంశాలపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. గతంలో ఇదే విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వినతిపత్రంలో పేర్కొంటూ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అసైన్డ్ భూములు కంపెనీ ఆధీనంలోకి ఎలా వచ్చాయో, ఇందుకు చట్టపరమైన అనుమతులు ఉన్నాయో లేదో, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఏ విధంగా జరిగాయో సమగ్రంగా వెల్లడించాలని కోరారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ పూర్తిస్థాయి విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, చట్టవిరుద్ధంగా ఏవైనా చర్యలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయం వినతిపత్రాన్ని స్వీకరించగా, ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో ఈసారి అయినా అధికారులు చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

# త్రిపుర డీజీపీ అనుమానాస్పద మృతి

- పోలీస్ ప్రధాన కార్యాలయ వాష్‌రూంలో ఉరేసుకున్న అనురాగ్ ధంకర్
- హైకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు కోరిన సీపీఎం, కాంగ్రెస్



**అగర్తల:** త్రిపుర డీజీపీ అనురాగ్ ధంకర్ (60) సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన కార్యాలయ వాష్‌రూంలో అనుమానాస్పదంగా ఉరేసుకొని కనిపించారు. వెంటనే ఆయనను అగర్తల ప్రభుత్వ జీబీపీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విష యాన్ని ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెల్లడించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్న ఆయన, ధంకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన అనురాగ్ ధంకర్ గతేడాది త్రిపుర డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీ విరమణకు ఇంకా సుమారు 11 నెలల సమయం ఉంది. ధంకర్‌కు భార్య, కెనడాలో నివసిస్తున్న కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, అంత్యక్రియల కోసం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఉన్న స్వగ్రామానికి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. 2003–04 మధ్య ఐక్యరాజ్యసమితి కొసోవో మిషన్‌లోనూ ఆయన సేవలందించారు. డీజీపీ మరణానికి దారితీసిన పరిస్థితులపై హైకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు సీపీఎం, కాంగ్రెస్ డిమాండ్ చేశాయి. నిజాయితీ, నిబద్ధత కలిగిన అధికారి బలమైన కారణం లేకుండా ఇలాంటి నిర్ణయం తీసుకుంటారని తాము నమ్మడం లేదని ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి వ్యాఖ్యానిం చారు. డీజీపీ మృతికి దారితీసిన అసలు కారణాలను ప్రభుత్వం పారదర్శకంగా వెలికితీయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదీప్ రాయ్ బర్మన్ కోరారు. ఇదిలా ఉండగా, అనురాగ్ ధంకర్ అత్యంత నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించిన పోలీసు అధికారిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్ దేవ్‌రాయ్ కొనియాడారు. ఘటనపై మేజిస్ట్రేట్ స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ద్వారా వాస్తవాలను త్వరలోనే వెల్లడిస్తా మని చెప్పారు. ధంకర్‌తో కలిసి పనిచేసిన పలువురు అధికారులు కూడా ఆయనను క్రమశిక్షణ, నిజాయితీ, మానవతా దృక్పథం కలిగిన పోలీసు అధికారిగా స్మరించారు.

# నిరసన నేరం కాదు

- ఢిల్లీ పోలీసుల తీరుపై మమత మండిపాటు
- విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించిన తృణమూల్ అధినేత్రి

**కోల్‌కతా:** నిరసన తెలపడం నేరం కాదు.. క్రూరత్వమే పాలన కాదు అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడం, టియర్‌గ్యాస్ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి సంభాషణకు బదులుగా బలప్రయోగాన్ని ఆశ్రయిం చడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజున కాక్‌రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లే ప్రయత్నం చేయగా, బారికేడ్లను దాటేందుకు యత్నించారని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది లాఠీచార్జి చేయడంతో పాటు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన మమత.. తమ విద్యార్థులను చూసి భయపడే ప్రభుత్వం ఎలాంటి ప్రభుత్వం? ప్రశ్నలకు సమాధానంగా లాఠీలు, టియర్‌గ్యాస్ వినియోగించడం ఎలాంటి ప్రజాస్వామ్యం? అని ప్రశ్నించారు. నిరసన వ్యక్తం చేస్తున్న యువతకు తాను అండగా ఉంటానని, బాధ్యులపై జవాబుదారీతనం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

# మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

- 10 మందికి గాయాలు, పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం
- కీవ్‌తో పాటు ఉక్రెయిన్ నగరాలపై రష్యా ఎదురుదాడులు
- కార్గో నౌకపై దాడిలో 10మంది సిబ్బంది మృతి



**మాస్కో/న్యూఢిల్లీ:** రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ సోమవారం 400కుపైగా డ్రోన్లతో భారీ దాడి చేపట్టింది. డ్రోన్లలో అత్యధికాన్ని రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేసినప్పటికీ, మాస్కో పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో 10 మంది గాయపడగా, నివాస భవనాలు, పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. పోడోల్స్క్ ప్రాంతంలోని చమురు నిల్వ కేంద్రంలో కూడా అగ్నిప్రమాదం సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు, ఉక్రెయిన్‌లోని రాజధాని కీవ్‌తో పాటు పలు నగరాలపై రష్యా క్షిపణులు, డ్రోన్లతో ఎదురుదాడులు కొనసాగించింది. డ్నిప్రోపెట్రోవ్‌స్క్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో 13 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అలాగే ఒడెస్సా నౌకాశ్రయం నుంచి బయలుదేరిన గినియా–బిస్సావు జెండాతో ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌకపై రష్యా దాడి చేయడంతో ఐదుగురు సిరియా నావికులు సహా మొత్తం 10 మంది సిబ్బంది మృతి చెందగా, మరో ఎనిమిది మందిని సురక్షితంగా రక్షించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రక్షణ శాఖలో మార్పులు, సైన్యాధిపతి నియామకానికి సంబంధించిన పరిణామాల నేపథ్యంలో దేశంలో నెలకొన్న రాజకీయ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో సమీప భవిష్యత్తులో శాంతి చర్చలకు అవకాశాలు కనిపించడం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## నలుగురు భారతీయులు మృతి

ఉక్రెయిన్‌లోని ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన ఎంవీ గోల్డెన్ లియో వ్యాపార నౌకపై జరిగిన దాడిలో నలుగురు భారతీయులు మృతి చెందినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సోమవారం వెల్లడించింది. నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఐదుగురు భారతీయులు ఉన్నట్లు తెలిపింది. ఈ దాడిలో నలుగురు భారతీయులు దుర్మరణం పాలవగా, మరో భారతీయుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎంఈఏ పేర్కొంది. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన భారత్, అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, సముద్ర వాణిజ్య స్వేచ్ఛకు భంగం కలిగించడం అత్యంత ఖండనీయమని పేర్కొంది. అయితే ఈ దాడిని ఎవరు నిర్వహించారనే విషయాన్ని ఎంఈఏ వెల్లడించలేదు. ప్రస్తుతం రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# పాల్ఘర్‌లో పట్టపగలు బంగారు దుకాణంలో తుపాకీతో దోపిడీ

- సీసీటీవీలో రికార్డు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

**ప్రజానావ, ముంబై:** పాల్ఘర్ జిల్లా దహనులోని ఇరానీ నగర్ ప్రాంతంలోని న్యూ లక్ష్మి జ్యువెలర్స్ దుకాణంలో ముగ్గురు గుర్తుతెలియని దుండగులు పట్టపగలు తుపాకీతో బెదిరించి లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఒకరు తుపాకీతో బయట కాపలా కాస్తుండగా, మరో ఇద్దరు దుకాణంలోకి ప్రవేశించి బంగారాన్ని సంచిలో నింపుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఈ ఘటన ఎదురుగా ఉన్న దుకాణంలోని సీసీటీవీలో రికార్డు కాగా, వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖాలను గుడ్డలతో కప్పుకున్న దుండగులను గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసిన దహను పోలీసులు, పాల్ఘర్ లోకల్ క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి నిందితుల కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

# భారత్ – మోల్డోవా మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసుల ప్రతిపాదన

- విమాన అనుసంధానంపై సాధ్యాసాధ్యాల పరిశీలనకు మోల్డోవా ఆసక్తి
- మోల్డోవాలో వైద్య విద్య చదువుతున్న సుమారు 2వేల మంది భారతీయ విద్యార్థులు



**చిసినౌ:** భారత్, మోల్డోవా మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులు ప్రారంభించే అవకాశాలను పరిశీలించాలని మోల్డోవా ప్రభుత్వం ప్రతిపాదించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) పశ్చిమ విభాగం కార్యదర్శి సిబి జార్జ్ వెల్లడించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోల్డోవా పర్యటన సందర్భంగా సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. మోల్డోవాకు భారతీయుల రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా అక్కడ సుమారు 2 వేల మంది భారతీయ విద్యార్థులు వైద్య విద్య అభ్యసిస్తున్న నేపథ్యంలో ప్రత్యక్ష విమాన సర్వీసుల అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ఇరు దేశాల పరస్పర ఆకాంక్షల జాబితాలో ఉందని, అయితే అది ఎప్పుడు అమల్లోకి వస్తుందనే విషయంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని చెప్పారు. ఇదిలా ఉండగా, భారత్, మోల్డోవా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రానున్న కొన్నేళ్లలో రెట్టింపు చేసే దిశగా ఇరు దేశాలు కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు సిబి జార్జ్ తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత్–మోల్డోవా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 16.75 మిలియన్ అమెరికన్ డాలర్లుగా నమోదైంది.

# కాంగోలో ఎబోలా విజృంభణ

- 930కు చేరిన మరణాలు
- 24 గంటల్లో 37మంది మృతి
- 2,344కు చేరిన కేసుల సంఖ్య



**బునియా:** కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళనకర స్థాయికి చేరుకుంది. తాజా పరిస్థితుల్లో వైరస్ కారణంగా మరణించిన వారి సంఖ్య కనీసం 930కు చేరినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. శనివారం నాటికి మొత్తం 2,344 ఎబోలా కేసులు నమోదుకాగా, గత 24 గంటల్లోనే మరో 37 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. తూర్పు కాంగోలో మే 15న ఎబోలా వ్యాప్తిని అధికారికంగా ప్రకటించినప్పటి నుంచి వ్యాధి అత్యంత వేగంగా విస్తరిస్తోందని ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం వ్యాపిస్తున్న బుండిబుగ్యో వైరస్‌కు ఇప్పటివరకు ఆమోదిత టీకా గానీ, నిర్దిష్ట చికిత్స గానీ అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వైరస్ బారినపడి ఇప్పటి వరకు 36 మంది ఆరోగ్య సిబ్బంది కూడా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వివరాల ప్రకారం, కొత్తగా నమోదవుతున్న కేసుల్లో సుమారు 80 శాతం వరకు వ్యాధి వ్యాప్తి మూలాన్ని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. తిరుగుబాటుదారుల హింస, ఆరోగ్య సిబ్బందిపై దాడులు, వేతనాల సమస్యలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం 724 మంది బాధితులు ఐసోలేషన్ కేంద్రాలు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని కాంగో ప్రభుత్వం తెలిపింది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరిస్తూ పర్యవేక్షణ చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది.

# మోదీ యువత వ్యతిరేక ప్రధాని

- ప్రశ్నాపత్రాల లీకేజీలతో కోట్లాది మంది విద్యార్థులు నష్టపోయారు
- విద్యార్థుల డిమాండ్లను అంగీకరించి చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** దేశ చరిత్రలోనే ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత యువత వ్యతిరేక ప్రధానమంత్రి అని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా 'చలో సంసద్' కార్యక్రమం చేపట్టిన కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి చేయడం, టియర్‌గ్యాస్ ప్రయోగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన రాహుల్ గాంధీ, దేశంలో ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా 152 ఘటనల్లో సుమారు 7.5 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినప్పటికీ ఒక్క నిందితుడిపైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రశ్నాపత్రాలను లీక్ చేసినవారు స్వేచ్ఛగా తిరుగుతుంటే, తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఎత్తడం బాధాకరమని అన్నారు. విద్యార్థులు నేరస్థులు కాదని, నాణ్యమైన, పారదర్శకమైన విద్యా వ్యవస్థను మాత్రమే కోరుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. వారి డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనని, వాటిని అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడం సమర్థనీయం కాదని, కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే దేశ విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరుగుతోందని ఆరోపించిన రాహుల్ గాంధీ, యువత ఆవేదనను కేంద్ర ప్రభుత్వం గౌరవించి వారి న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పరీక్షలు నిర్వహించడం చేతకాకపోతే అధికారం వదిలేయండి

- నీట్ ప్రశ్నాపత్రం లీక్‌పై నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే



నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై లాఠీచార్జి చేయ డం ద్వారా కేంద్ర ప్రభుత్వం వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించడం కూడా చేతకాని ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హత లేదని తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఖర్గే, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యపై జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. మీడియాతో మాట్లాడుతూ, నీట్ పరీక్షల వ్యవహారంలో ఇప్పటికే పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమస్యలను చెప్పేందుకు ఢిల్లీకి వచ్చిన విద్యార్థులపై లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యంపై దాడితో సమానమని విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు రామమందిరం విరాళాల దుర్వినియోగం అంశాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో లేవనెత్తిందని ఖర్గే తెలిపారు.

# పూరీ రథయాత్ర ఘటనపై న్యాయ విచారణ జరపాలి

- మృతులు, క్షతగాత్రుల వివరాలను ప్రభుత్వం దాచిపెడుతోంది: బీజేడీ
- మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి: కాంగ్రెస్



**భువనేశ్వర్:** పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా చోటు చేసుకున్న అవ్యవస్థ, ప్రాణనష్టంపై హైకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ చేపట్టాలని ఒడిశాలోని ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు సోమవారం డిమాండ్ చేశాయి. రథయాత్ర సందర్భంగా జరిగిన మరణాలు, గాయాల అసలు వివరాలను బీజేపీ ప్రభుత్వం దాచి పెడుతోందని, ఘటనను తొక్కిసలాటగా గుర్తించేం దుకు నిరాకరిస్తోందని బీజేడీ సీనియర్ నేత సంజయ్ దాస్ బర్మా ఆరోపించారు. రథయాత్ర సందర్భంగా 350 మందికిపైగా భక్తులు గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురిలో ముగ్గురు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. అయితే గుండెపోటు, ఊపిరాడకపోవడం వంటి కారణాలు చూపిస్తూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నేత ఎస్.ఎస్. సలూజా మాట్లాడుతూ, ఈ ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### రూ.10 లక్షల ఆర్థిక సాయం

మరోవైపు, రథయాత్ర సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు భక్తుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడం, వర్షాల కారణంగా అలసట, డీహైడ్రేషన్, ఊపిరాడక పోవడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తాయని ప్రభుత్వం పేర్కొంది. రథయాత్ర మొత్తం ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించామని, ఎలాంటి తొక్కిసలాట ఘటన చోటుచేసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# హిమాలయ రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

- జమ్మూకశ్మీర్‌లో రెండ్రోజుల్లో 23 మంది మృతి.. ఏడుగురి గల్లంతు
- ఉత్తరాఖండ్‌లో 150 రహదారులు మూసివేత
- తాత్కాలికంగా నిలిచిపోయిన చార్‌ధా యాత్ర



**న్యూఢిల్లీ:** హిమాలయ ప్రాంత రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా సోమవారం మరో 11 మంది ప్రాణాలు కోల్పోవడంతో గత రెండు రోజుల వ్యవధిలో మరణాల సంఖ్య 23కు చేరింది. పూంచ్, రాజౌరి జిల్లాల్లో మరో ఏడుగురు గల్లంతవగా, వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఉత్తరాఖండ్‌లో నిరంతర వర్షాల ప్రభావంతో నాలుగు జాతీయ రహదారులు సహా సుమారు 150 రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. భద్రతా కారణాల దృష్ట్యా చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివే సిన రాష్ట్ర ప్రభుత్వం, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ వర్షాల ప్రభావం తీవ్రంగానే కనిపిస్తోంది. కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో విద్యాసంస్థలను మూసివేయగా, 36 రహదారులు దెబ్బతిన్నాయి. అదేవిధంగా 43 తాగునీటి పథకాలు, ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాఖండ్, బిహార్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు వాయవ్య, ఈశాన్య భారతంలో రుతుపవనాల ప్రభావం కొనసాగనున్న నేపథ్యంలో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, అసోం తదితర రాష్ట్రాలకు కూడా భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో ఆయా రాష్ట్రాల యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి.

# సముద్ర దిగ్బంధనం

- బాబ్ అల్-మండెబ్ జలసంధిని సౌదీ నౌకలకు మూసివేస్తామని హౌతీల ప్రకటన
- తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు

**కైరో:** యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై సముద్ర దిగ్బంధనాన్ని ప్రకటించారు. యెమెన్‌పై కొనసాగుతున్న దిగ్బంధనం, ఇటీవల సనా అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ వెల్లడించారు. ఈ నిర్ణయంతో ఎర్ర సముద్రానికి ప్రధాన ప్రవేశ ద్వారమైన బాబ్ అల్–మండెబ్ జలసంధి ద్వారా సౌదీ నౌకల రాకపోకలను నిలిపివేస్తామని హౌతీలు ప్రకటించారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో సుమారు 12 శాతం ఈ కీలక జలసంధి ద్వారానే సాగుతున్న నేపథ్యంలో, ఈ ప్రకటన అంతర్జాతీయ నౌకాయాన, వాణిజ్య రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2022లో యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, ఇటీవల హౌతీ నాయకులు ప్రయాణించిన విమానాన్ని లక్ష్యంగా చేసుకుని సనా అంతర్జాతీయ విమానాశ్రయంపై సౌదీ దాడి జరిపిందని హౌతీలు ఆరోపించారు. దీనికి ప్రతిగా సౌదీ అరేబియాలోని అబ్హా అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. హౌతీల తాజా సముద్ర దిగ్బంధన ప్రకటనతో మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రతతో పాటు అంతర్జాతీయ వాణిజ్య మార్గాలపై కూడా ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఉపాధ్యాయుడిపై స్క్రూడ్రైవర్‌తో విద్యార్థి దాడి

**చండీగఢ్:** హర్యానాలోని సిర్సా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి ఓ ఉపాధ్యాయుడిపై స్క్రూడ్రైవర్‌తో దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం జమాల్ గ్రామ ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధ్యాయుడు సునీల్ బిరాట్ తరగతి గదిలో విద్యార్థుల హోంవర్క్‌ను పరిశీలిస్తు న్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ విద్యార్థి స్క్రూడ్రైవర్‌తో ఆయన మెడపై పలుమార్లు దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన ఉపా ధ్యాయుడిని తొలుత నాథుసారి చోప్తా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం సిర్సా సివిల్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



# ఆటగాళ్లకు ఘన స్వాగతం

- స్వదేశానికి చేరుకున్న ఫిఫా చాంపియన్లు
- మాడ్రిడ్‌లో విజయోత్సవ ర్యాలీ
- పురుషులు, మహిళల టైటిళ్లు ఒకేసారి సాధించిన తొలి దేశంగా చరిత్ర

**మాడ్రిడ్:** ఫిఫా ప్రపంచకప్ విజేత స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టు స్వదేశానికి చేరుకుంది. టైటిల్‌తో తిరిగొచ్చిన 26 మంది ఆటగాళ్లకు దేశవ్యాప్తంగా అభిమానులు ఘన స్వాగతం పలికారు. సోమవారం జట్టు సభ్యులు స్పెయిన్ రాజకుటుంబాన్ని, ప్రధాని పెడ్రో శాంచెజ్‌ను కలుసుకున్నారు. అనంతరం ఆటగాళ్లు ఓపెన్ టాప్ బస్సులో మాడ్రిడ్ నగర వీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మోన్‌క్లోవా ప్యాలెస్ సమీపం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ చారిత్రక మార్గాల మీదుగా సిబెలెస్ స్క్వేర్ వరకు కొనసాగింది. అక్కడ వేలాది మంది అభిమానులతో కలిసి ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. న్యూజెర్సీలోని ఈస్ట్ రదర్‌ఫోర్డ్‌లో ఆదివారం జరిగిన ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో అర్జెంటీనాను 1–0తో ఓడించిన స్పెయిన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2010లో దక్షిణాఫ్రికా వేదికగా తొలిసారి ప్రపంచ కప్ గెలిచిన స్పెయిన్‌కు ఇది రెండో విజయం. స్పెయిన్ విజయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ అభినందనలు తెలిపారు.

## సంబరాల్లో మాడ్రిడ్

ప్రపంచకప్ విజయంతో మాడ్రిడ్ నగరం సంబరాల్లో మునిగిపోయింది. వేలాది మంది అభిమానులు స్పెయిన్ జెండాలు పట్టుకుని వీధుల్లోకి తరలివచ్చారు. ప్యూర్టా డెల్ సోల్ తదితర ప్రాంతాలు అభిమానులతో కిక్కిరిశాయి. పాటలు, నృత్యాలు, బాణసంచాలతో రాత్రంతా వేడుకలు కొనసాగాయి. 'జట్టు కోసం ఏమైనా చేస్తాను. కేవలం మూడు, నాలుగు గంటలే నిద్రపోయాను' అని 19 ఏళ్ల అభిమాని విక్టర్ అల్వారెజ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఇదిలాఉంటే 2023లో మహిళల ఫిఫా ప్రపంచకప్‌ను కూడా గెలుచుకున్న స్పెయిన్, పురుషులు, మహిళల ప్రపంచకప్ టైటిళ్లు ఒకేసారి సాధించిన తొలి దేశంగా చరిత్ర సృష్టించింది. అయితే సంబరాల వేళ విషాదం చోటు చేసుకుంది. మాడ్రిడ్‌కు వాయువ్యంగా ఉన్న సలమాంకాలో వేడుకల్లో భాగంగా ఓ ఫౌంటెన్‌పైకి ఎక్కిన 13ఏళ్ల బాలుడు అది కూలిపోవడంతో మృతి చెందాడు.

## కొత్త ఉత్సాహంలో దేశం

2010 ప్రపంచకప్ విజయంతో పోలిస్తే ప్రస్తుత స్పెయిన్ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అప్పట్లో ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం వంటి సమస్యలు ఎదుర్కొన్న దేశం ప్రస్తుతం యూరోజోన్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. తాజా ప్రపంచకప్ విజయం దేశంలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు అభిప్రాయపడుతున్నారు.

# కొత్త టైటిల్ స్పాన్సర్ కోసం బీసీసీఐ వేట

- స్వదేశీ మ్యాచ్‌ల హక్కులకు టెండర్లు ఆహ్వానం
- ఆగస్టుతో ముగియనున్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఒప్పందం
- అంతర్జాతీయ, దేశీయ టోర్నీలకు వర్తించే హక్కుల కోసం బిడ్ల ఆహ్వానం




**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) స్వదేశంలో నిర్వహించే అంతర్జాతీయ, దేశీయ మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్ హక్కుల కోసం టెండర్లను ఆహ్వానించింది. ప్రస్తుతం ఈ హక్కులను కలిగి ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఒప్పందం ఆగస్టు 2026తో ముగియనుండటంతో కొత్త స్పాన్సర్ ఎంపిక ప్రక్రియను బీసీసీఐ ప్రారంభించింది. ఈ మేరకు పోటీ విధానంలో బిడ్లను ఆహ్వానిస్తూ బీసీసీఐ 'ఇన్విటేషన్ టు టెండర్' (ఐటీటీ) విడుదల చేసింది. ఆసక్తి ఉన్న సంస్థలు రూ.లక్ష (జీఎస్‌టీ అదనం) చెల్లించి టెండర్ పత్రాలను పొందవచ్చని తెలిపింది. ఆగస్టు 4 వరకు టెండర్ పత్రాల కొనుగోలుకు అవకాశం ఉండగా.. ఆగస్టు 5 వరకు సందేహాల నివృత్తికి గడువు ఇచ్చింది. బిడ్ పత్రాలను ఆగస్టు 13లోగా సమర్పించాల్సి ఉంటుంది. టైటిల్ స్పాన్సర్‌గా ఎంపికయ్యే సంస్థకు బీసీసీఐ నిర్వహించే పలు కీలక ఈవెంట్ల హక్కులు లభించనున్నాయి. ఇందులో భారత పురుషుల, మహిళల జట్లు స్వదేశంలో ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ, ఇరానీ కప్, వయోపరిమితి పోటీలు కూడా ఉన్నాయి. టెండర్‌లో పేర్కొన్న అర్హత ప్రమాణాలు, నిబంధనలను పూర్తి చేసిన సంస్థలే బిడ్లను సమర్పించేందుకు అర్హత పొందుతాయని బీసీసీఐ స్పష్టం చేసింది. కేవలం టెండర్ పత్రాలను కొనుగోలు చేయడం వల్ల బిడ్డింగ్‌లో పాల్గొనే హక్కు లభించదని పేర్కొంది.

## 2023లో ఐడీఎఫ్‌సీతో ఒప్పందం

ప్రస్తుతం టైటిల్ స్పాన్సర్ హక్కులు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వద్ద ఉన్నాయి. 2023 సెప్టెంబర్‌లో బీసీసీఐతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ఆగస్టు 2026 వరకు కొనసాగనుంది. మరోవైపు టీమ్ ఇండియాకు అధికారిక లీడ్, జెర్సీ స్పాన్సర్‌గా అపోలో టైర్స్ కొనసాగుతోంది. బీసీసీఐ తన ఈవెంట్ల అసోసియేట్ పార్ట్‌నర్ హక్కుల కోసం కూడా రిక్వెస్ట్ ఫర్ కొటేషన్ (ఆర్ఎఫ్‌క్యూ) విడుదల చేసింది. ఆసక్తి ఉన్న సంస్థలు రూ.లక్ష రుసుముతో ఆర్ఎఫ్‌క్యూ పత్రాలను పొందవచ్చని తెలిపింది. ఆగస్టు 14 వరకు పత్రాల కొనుగోలు, ఆగస్టు 16 వరకు సందేహాల నివృత్తి, ఆగస్టు 25 వరకు కొటేషన్ సమర్పణకు గడువు విధించింది. ఈ హక్కులు స్వదేశంలో జరిగే అంతర్జాతీయ మ్యా చ్‌లు, దేశీయ టోర్నీలు, వయోపరిమితి పోటీలకు వర్తించనున్నాయి.

# చైనా ఓపెన్‌లో సింధు సవాల్

గాయం కారణంగా సాత్విక్–చిరాగ్ దూరం

## జపాన్ ఓపెన్ విజయంతో జోరుమీదున్న స్టార్ షట్లర్



**చాంగ్‌జౌ:** జపాన్ ఓపెన్ టైటిల్‌తో ఆత్మవిశ్వాసం పెంచుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. చైనా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ వేటకు సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత బృందానికి సింధు నాయకత్వం వహించనుంది. అయితే స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి మాత్రం గాయం కారణంగా పోటీకి దూరమైంది. దాదాపు రెండేళ్ల తర్వాత జపాన్ ఓపెన్‌లో టైటిల్ సాధించిన సింధు.. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉంది. ఫైనల్లో మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యమగూచిని ఓడించిన ఆమె.. టోర్నీ మొత్తం ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా విజేతగా నిలిచింది. 2016 చైనా ఓపెన్ విజేత అయిన సింధు.. ఈసారి తొలి రౌండ్‌లో తన దేశానికే చెందిన ఉనతి హుడాతో తలపడనుంది. రెండో రౌండ్‌లో చైనా నాలుగో సీడ్ చెన్ యుఫీని ఎదుర్కొనే అవకాశం ఉంది. మరో భారత క్రీడాకారిణి దేవికా సిహాగ్ తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్‌తో పోటీ పడనుంది. సింగపూర్ ఓపెన్ సూపర్–750 టైటిల్ సాధించిన సాత్విక్–చిరాగ్ జోడీ ప్రస్తుతం సాత్విక్ భుజ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడంపై దృష్టి సారించింది. జపాన్ ఓపెన్‌కు దూరమైన ఈ జోడీ.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధమయ్యేందుకు చైనా ఓపెన్‌లో పాల్గొనడం లేదు.

# విమర్శలు పట్టించుకోను: రోహిత్




**లండన్:** తన భవిష్యత్‌పై వస్తున్న విమర్శలు, ఊహాగానాలను పట్టించుకోనని టీమిండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. తాను క్రికెట్ ఆడుతున్నంత కాలం విమర్శలు కొనసాగుతూనే ఉంటాయని, వాటిని పక్కన పెట్టి జట్టుకు విజయాలు అందించడంపైనే దృష్టి సారిస్తానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన వన్డేలో 138 పరుగులతో మెరిసిన రోహిత్.. భారత్ ఓడినప్పటికీ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. మ్యాచ్ అనంతరం బీసీసీఐ టీవీతో మాట్లాడుతూ తన కెరీర్ ప్రారంభం నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నానని పేర్కొన్నాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి విమర్శలు ఉన్నాయి. నేను ఆడుతున్నంత కాలం అవి కొనసాగుతాయి. వాటి గురించి ఆలోచించను. మైదానంలో బ్యాట్‌తో జట్టుకు సహకరించడం, దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా బాధ్యత' అని రోహిత్ చెప్పాడు. ఇంగ్లండ్‌లో ఆడటం ఎప్పుడూ ప్రత్యేక అనుభూతిని ఇస్తుందని రోహిత్ తెలిపాడు. అక్కడి మైదానాలు, వాతావరణ పరిస్థితులు, పిచ్‌లు ఆటగాళ్లకు సవాళ్లు విసురుతాయని పేర్కొన్నాడు.

## కోహ్లీతో అనుబంధం ప్రత్యేకం

విరాట్ కోహ్లీతో కలిసి ఎన్నో ఏళ్లుగా ఆడుతున్నామని, అతడితో బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుందని రోహిత్ చెప్పాడు. లార్డ్స్ వన్డేలో ఇద్దరూ కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయామని తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనలో తొలి మ్యాచ్ గెలిచిన తర్వాత సిరీస్ కోల్పోవడం నిరాశ కలిగించిందని అన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో చివరి వరకు పోరాడామని, చివరికి 20–25 పరుగుల తేడాతో వెనుకబడ్డామని వివరించాడు. భారత యువ బౌలర్లకు రోహిత్ అండగా నిలిచాడు. వారికి వన్డే క్రికెట్‌లో అనుభవం తక్కువగా ఉందని, మరిన్ని అవకాశాలు ఇస్తే వారు మరింత మెరుగుపడతారని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్ సిరీస్ నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేస్తామని ధీమా వ్యక్తం చేశాడు.

# జార్ఖండ్‌లో టాటా స్టీల్ రూ.10వేల కోట్ల పెట్టుబడులు




రాంచీ: జార్ఖండ్‌లోని ప్రాజెక్టుల విస్తరణకు టాటా స్టీల్ 2028 నాటికి రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 వేల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో 27.35 మిలియన్ టన్నులుగా ఉన్న ఉక్కు తయారీ సామర్థ్యాన్ని 40 మిలియన్ టన్నులకు పెంచే లక్ష్యంతో కంపెనీ విస్తరణ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఉక్కు ఉత్పత్తి చేసే ఆధునిక సాంకేతికతలపై దృష్టి సారిస్తోంది. ఝార్ఖండ్ ప్రాజెక్టుల్లో హైసార్నా, ఈజీ మెల్టింగ్ టెక్నాలజీల అభివృద్ధికి రూ.7 వేల కోట్లు, జంషెడ్‌పూర్ టిన్‌ప్లేట్ విభాగం విస్తరణకు రూ.2,600 కోట్లు, కాంబి మిల్‌కు రూ.1,500 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపింది. టాటా స్టీల్ అభివృద్ధి చేసిన హైసార్నా సాంకేతికతతో సంప్రదాయ కోక్, సింటర్, పెల్లెట్ ప్లాంట్ల అవసరం లేకుండా ఇనుము తయారీ సాధ్యమవుతుందని పేర్కొంది. జంషెడ్‌పూర్‌లో ఏడాదికి ఒక మిలియన్ టన్నుల సామర్థ్యంతో పైలట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ విధానంతో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు సుమారు 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం భారత్, నెదర్లాండ్స్, థాయ్‌లాండ్‌లలో కలిపి 36 మిలియన్ టన్నులకు పైగా ఉక్కు తయారీ సామర్థ్యం ఉన్న టాటా స్టీల్, దీన్ని దీర్ఘకాలంలో 50 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఇండిగో భారీ ఒప్పందం

- లీప్ ఇంజిన్ల కొనుగోలుపై సీఎఫ్ఎం ఇంటర్నేషనల్‌తో ఎంఓయూ
- చరిత్రలోనే అతిపెద్ద ఏకైక లీప్ ఇంజిన్ ఆర్డర్
- బెంగళూరులో ఎంజిన్ ఎంఆర్ఓ కేంద్రానికి సాంకేతిక సహకారం, విడిభాగాల సరఫరా
- కొత్త ఎయిర్‌బస్ విమానాలకు హనీవెల్ ఏరోస్పేస్ నుంచి ఏవియానిక్స్, పవర్ సిస్టమ్‌లు




**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో 510 ఎయిర్‌బస్ ఏ320 నియో కుటుంబ విమానాలకు అవసరమైన 1,000కు పైగా లీప్–1ఏ ఇంజిన్ల కొనుగోలు కోసం సీఎఫ్ఎం ఇంటర్నేషనల్‌తో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బ్రిటన్‌లో జరుగుతున్న ఫార్న్‌బరో అంతర్జాతీయ ఎయిర్‌షో సందర్భంగా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం సీఎఫ్ఎం ఇంటర్నేషనల్ చరిత్రలో లీప్ ఇంజిన్లకు లభించిన అతిపెద్ద ఏకైక ఆర్డర్‌గా నిలవనుంది. అయితే ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక విలువను ఇరు సంస్థలు వెల్లడించలేదు. ఈ ఒప్పందంలో భాగంగా బెంగళూరులో ఇండిగో ఏర్పాటు చేయనున్న ఎంజిన్ నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రానికి సీఎఫ్ఎం సాంకేతిక సహకారం అందించడంతో పాటు విడిభాగాల సరఫరాకు దీర్ఘకాలిక ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ప్రస్తుతం ఇండిగో 400కు పైగా విమానాలతో దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో సేవలు అందిస్తుండగా, మరో 900కుపైగా ఎయిర్‌బస్ విమానాలు ఆర్డర్‌లో ఉన్నాయి. 2016 నుంచి సీఎఫ్ఎం ఇంటర్నేషనల్ తమ విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతోందని, లీప్ ఇంజిన్ల అత్యుత్తమ పనితీరు సంస్థ విస్తరణ ప్రణాళికలకు బలాన్నిస్తుందని ఇండిగో సీఈఓ డిజిగ్నేట్ విల్లీ వాల్ష్ తెలిపారు. మరోవైపు, ఇండిగో ఆర్డర్ చేసిన 810 కొత్త ఎయిర్‌బస్ ఏ320 నియో కుటుంబ విమానాలకు అవసరమైన ఏవియానిక్స్, పవర్ సిస్టమ్‌ల సరఫరా కోసం హనీవెల్ ఏరోస్పేస్‌ను ఎంపిక చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ ఒప్పందంతో ఇండిగో తన విమానాల ఆధునికీకరణ, నిర్వహణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోనుంది.

Business
బిజినెస్

# బ్యాంకింగ్ షేర్ల పతనం.. మార్కెట్లు డౌన్

- 443 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. నిఫ్టీ 24,239 వద్ద ముగింపు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన ప్రైవేటు బ్యాంకుల షేర్లలో భారీ అమ్మకాలు, అమెరికా–ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్ల పతనం సూచీలపై తీవ్ర ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 442.93 పాయింట్లు (0.57 శాతం) క్షీణించి 77,708.52 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఒక దశలో 783.16 పాయింట్లు పడిపోయి 77,368.29 స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.80 పాయింట్లు (0.39 శాతం) తగ్గి 24,238.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 5.48 శాతం నష్టపోయింది. త్రైమాసిక ఫలితాల్లో మార్జిన్లపై నెలకొన్న ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. హెచ్‌డీఎఫ్‌సీ షేరు కూడా 5.12 శాతం దిగజారింది. మారుతీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి ప్రముఖ కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరోవైపు ట్రెంట్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాలను నమోదు చేశాయి.

## ముడిచమురు ధరల ప్రభావం

అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. బ్రెంట్ క్రూడ్ ధర ఒక దశలో బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరుకోగా, అనంతరం స్వల్పంగా తగ్గి 88.06 డాలర్ల వద్ద ట్రేడైంది. ప్రధాన సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ విస్తృత మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

# ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయాలి

- అంతర్గత అంబుడ్స్‌మన్ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలి
- వినియోగదారుల విశ్వాసానికి పారదర్శక ఫిర్యాదుల పరిష్కారమే కీలకం
- అర్హత ఉన్న ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా అంతర్గత అంబుడ్స్‌మన్‌కు పంపాలి
- బ్యాంకులకు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ సూచన




**ముంబై:** బ్యాంకులు, ఇతర నియంత్రిత ఆర్థిక సంస్థలు తమ అంతర్గత ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను సమగ్రంగా సమీక్షించి మరింత సమర్థవంతంగా రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె. సూచించారు. అంతర్గత అంబుడ్స్‌మన్ (ఇంటర్నల్ అంబుడ్స్‌మన్) పరిశీలనకు పంపాల్సిన ఫిర్యాదులు ఎలాంటి సాంకేతిక లేదా విధానపరమైన లోపాల కారణంగా ఆ ప్రక్రియను దాటిపోకుండా ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐ నిర్వహించిన ఇంటర్నల్ ఒంబుడ్స్‌మన్ సదస్సులో ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసమే బ్యాంకింగ్ వ్యవస్థకు మూలస్తంభమని అన్నారు. ఫిర్యాదులను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించడం ద్వారా ఆర్థిక సంస్థలపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ స్థాయిలో వినియోగదారుల పక్షాన పరిష్కారమైన అనేక ఫిర్యాదులు అంతకుముందు ఇంటర్నల్ అంబుడ్స్‌మన్ పరిశీలనకు పంపకపోవడం ఆందోళన కలిగించే అంశమని స్వామినాథన్ పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా అంతర్గత అంబుడ్స్‌మన్‌కు పంపించేలా బ్యాంకులు తమ వ్యవస్థలను సరిచేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో బ్యాంకింగ్ సేవలు వేగవంతమవుతున్న నేపథ్యంలో వినియోగదారుల అంచనాలు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో లావాదేవీలకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా, పారదర్శకంగా పరిష్కరించే విధానాలను అన్ని ఆర్థిక సంస్థలు అమలు చేయాలని స్వామినాథన్ సూచించారు.

# గూగుల్, యూట్యూబ్ ఆరోగ్యకరమైన గైడ్‌బుక్

- కుటుంబాల్లో బాధ్యతాయుత టెక్నాలజీ వినియోగానికి కొత్త మార్గదర్శిని
- నిమ్‌హాన్స్, ఫోర్టిస్ నిపుణుల సలహాలతో రూపకల్పన
- పిల్లల భద్రత, పెద్దల గోప్యతకు ఉపయోగపడే సూచనల సమాహారం




**న్యూఢిల్లీ:** భారతీయ కుటుంబాల్లో పిల్లలు, తల్లిదండ్రులు ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను అలవరచుకునేలా గూగుల్ ఇండియా, యూట్యూబ్ సంయుక్తంగా 'డిజిటల్ వెల్‌బీయింగ్ గైడ్‌బుక్'ను విడుదల చేశాయి. ఈ మార్గదర్శిని నిమ్‌హాన్స్, ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన నిపుణులు, పేరెంటింగ్ నిపుణుల సూచనలు, శాస్త్రీయ ఆధారాలతో రూపొందించినట్లు సంస్థలు వెల్లడించాయి. స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేయడమే కాకుండా, కుటుంబ సభ్యులు టెక్నాలజీని సమతుల్యంగా, బాధ్యతాయుతంగా వినియోగించే అలవాట్లను పెంపొందించడమే ఈ గైడ్‌బుక్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నాయి. టెక్నాలజీ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించడం కంటే, కుటుంబ సభ్యులంతా కలిసి ఆరోగ్యకరమైన డిజిటల్ సంస్కృతిని ఏర్పరచుకోవడంపై ఇందులో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపాయి. కుటుంబ సభ్యులంతా కలిసి మీడియా వినియోగానికి సంబంధించి స్పష్టమైన నిబంధనలు రూపొందించుకోవడం, ఇంట్లో టెక్నాలజీ రహిత ప్రాంతాలను ఏర్పాటు చేయడం, డిజిటల్ వినియోగానికి సమయ పరిమితులు నిర్ణయించుకోవడం వంటి పలు ఆచరణాత్మక సూచనలను గైడ్‌బుక్‌లో పొందుపరిచారు.

భారత్‌లో ఒకే స్మార్ట్‌ఫోన్‌ను కుటుంబ సభ్యులంతా వినియోగించే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, యూట్యూబ్‌లోని 'హూజ్ వాచింగ్' వంటి ఫీచర్ల ద్వారా పిల్లల భద్రతను, పెద్దల గోప్యతను ఒకేసారి కాపాడుకునే మార్గాలను కూడా ఈ గైడ్‌బుక్‌లో వివరించారు.

# పట్టాలకెక్కనున్న 'ఆర్17'

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్ తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తు న్నాయి. నటీనటులు, ఇతర సాంతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు డా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రావ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రావ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్‌లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటి ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటి 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

# 'రాకా'లో సిరి హనుమంతు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులు, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కారణంగా చిత్రంలో చిన్న పాత్రైనా చేయాలని పలువురు నటీనటులు ఆసక్తి చూపుతున్నారని టాక్ వినిపిస్తోంది. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ నుంచి తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో విభిన్న పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న అచ్చ తెలుగు నటి సిరి హనుమంతు 'రాకా'లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఓ సినీ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత ఎస్.కె.ఎన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడం తో ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిరి పాత్ర కథలో కీలక మలుపుకు కారణమవుతుందని, ఆమెకు మంచి ప్రాధాన్యం ఉండబోతుందనే చర్చ కూడా సినీ వర్గాల్లో సాగుతోంది. బిగ్‌బాస్ ద్వారా విస్తృత గుర్తింపు పొందిన సిరి హనుమంతు, ఇప్పుడు అల్లు అర్జున్ వంటి గ్లోబల్ స్టార్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రంలో భాగం కావడం ఆమె కెరీర్‌లో కీలక మైలు రాయిగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. 'రాకా' ప్రపంచవ్యాప్తం గా విడుదలయ్యేలా ప్లాన్ చేస్తున్న నేపథ్యంలో ఈ సినిమా ద్వారా సిరి హను మంతుకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారీ నిర్మాణ విలువలు, అట్లీ మార్క్ కమర్షియల్ ట్రీట్‌మెంట్, అల్లు అర్జున్ స్టార్‌డమ్‌కు తోడు కొత్త తరహా సైన్స్ ఫిక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



# కూతురికి మహేష్ బాబు ఎమోషనల్ బర్త్‌డే విషెస్

సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ దంపతుల కుమార్తె సితార ఘట్టమనేని నేడు 14వ పుట్టినరోజు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా కూతురికి భావోద్వేగ శుభాకాంక్షలు తెలియజేస్తూ చేసిన పోస్ట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సితారతో కలిసి దిగిన అందమైన ఫొటోను పంచుకున్న మహేష్ బాబు, నువ్వు ఎంత పెద్దదానివైనా.. ఎప్పటికీ నా లిటిల్ స్టార్‌వే. హ్యాపీ 14 సితార. రాబోయే ఏడాది నీకు అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నాను. లవ్ యూ ఆల్వేస్ అంటూ హృదయాన్ని హత్తుకునే సందేశాన్ని పంచుకున్నారు. ఫొటోలో కూతురిని ప్యాయంగా హత్తుకున్న మహేష్ బాబు, ఆనందంగా చిరునవ్వులు చిందిస్తున్న సితార అభిమానులను ఆకట్టుకున్నారు. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ కుటుంబానికి, ముఖ్యంగా పిల్లలకు మహేష్ బాబు ఎంత ప్రాధాన్యం ఇస్తారో ఈ పోస్ట్ మరోసారి చాటిచెప్పింది. సితార పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

# ఓటీటీలోకి బాలన్.. ది బాయ్

'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ – ది బాయ్'. చందు సలీవ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య సులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ – ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన న్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

# 'జననాయగన్'కు అదిరిపోయే అడ్వాన్స్ బుకింగ్స్



తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'జననాయగన్' ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమైంది. విడుదలకు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండగా, చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, బుకింగ్ ట్రెండ్ ఆ అంచనాలను మరింత బలపరుస్తోంది. గురువారం పూర్తిస్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, తొలి 24 గంటల్లోనే బుక్‌మైషో వేదికపై 2.36 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య విజయ్‌కు ఉన్న అభిమాన వర్గాన్ని, సినిమాపై నెలకొన్న ఆసక్తిని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. బుకింగ్స్ ఇదే వేగంతో కొనసాగితే విడుదల రోజున థియేటర్ల వద్ద భారీ సందడి నెలకొనే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే 'జననాయగన్' అనేక సవాళ్లను ఎదుర్కొంది. చిత్ర నిర్మాణంలో పలుమార్లు వాయిదాలు పడటంతో పాటు, కొన్ని కంటెంట్ లీక్ ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ వాటి ప్రభావం బాక్సాఫీస్‌పై కనిపించకుండా, సినిమా భారీ ఓపెనింగ్స్ నమోదు చేసే దిశగా దూసుకెళ్తోంది. విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత థియేటర్లలో విడుదలవుతున్న తొలి చిత్రం కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తోంది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ అత్యంత భారీ నిర్మాణ విలువలతో ఈ సినిమాను నిర్మించింది. 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు కీలక పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ అంచనాలు, స్టార్ కాస్ట్, అనిరుధ్ సంగీతం, విజయ్ క్రేజ్ కలిసి 'జననాయగన్'ను ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలబెట్టాయి. విడుదల తర్వాత ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.



# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటి భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి డా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# సోషల్ మీడియాకు కోట్లు ఇచ్చినా వెళ్లను

ప్రస్తుతం 'గట్టా కుస్తీ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్న నటి ఐశ్వర్య లక్ష్మి వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు రెండు వెబ్ సిరీస్‌లు, ఓ ఫిమేల్ – సెంట్రిక్ తమిళ చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫెమినిజం, సోషల్ మీడియా, కామెడీ, కొత్త ప్రాజెక్టుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'గట్టా కుస్తీ 2' బాక్సాఫీస్ కలెక్షన్ల వివరాలను నా టీమ్ ఎప్పటికప్పుడు చెబుతుంటుంది. అయితే వాటికంటే ప్రేక్షకులు థియేటర్లలో సినిమా చూసి నవ్వుతూ ఆస్వాదించడమే నాకు అసలైన సంతృప్తి. అదే మా కష్టానికి ఫలితం. ఈ సినిమా వినోదంతో పాటు స్త్రీ, పురుష సమానత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఒక మహిళ తన కలలను నెరవేర్చుకునే ప్రయాణంలో పురుషుడు ఎలా అండగా నిలవగలడో ఇందులో చూపించాం. ప్రియాంక చోప్రాకు ఆమె భర్త నిక్ జోనాస్ ప్రతి విషయంలో అండగా నిలిచినట్లే మా సినిమా కూడా అదే సందేశాన్ని ఇస్తుంది'' అని తెలిపారు. కామెడీ పాత్రలు చేయడం తనకు చాలా ఇష్టమని, అయితే ఆ విభాగంలో ఇంకా మెరుగుపడాల్సి ఉందని ఐశ్వర్య అన్నారు. సోషల్ మీడియా గురించి మాట్లాడుతూ.. 'అక్కడ నేను ఎప్పుడూ సురక్షితంగా ఉన్నానని అనిపించలేదు. సోషల్ మీడియా లేకుండా పని చేయడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. మళ్లీ అందులోకి వెళ్లాలనే ఆలోచన కూడా లేదు. గతంలో నా ఫొటోలను మార్ఫ్ చేయడం, ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం వల్ల అందరూ నన్ను ద్వేషిస్తున్నారేమో అనిపించేది. ఇప్పుడు ప్రజలను నేరుగా కలవడమే నాకు ఆనందంగా ఉంది. రోజుకు రూ.100 కోట్లు ఇచ్చినా సోషల్ మీడియా దరిదాపుల్లోకి వెళ్లను. నా పెంపుడు కుక్క ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారానే వార్తలు, సినిమా అప్‌డేట్స్ చూస్తుంటాను' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం దర్శకుడు ఆనంద్ తెరకెక్కిస్తున్న ఫిమేల్ – సెంట్రిక్ తమిళ చిత్రంలో ఐశ్వర్య పోలీస్ అధికారిణి పాత్రలో నటిస్తున్నారు. అలాగే 'తీవినయ్ పొట్రు', 'లవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లు కూడా ఆమె చేతిలో ఉన్నాయి. ఇక బాలీవుడ్‌లోనూ ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# 'టాక్సిక్'లో యశ్ – తారా సుతారియా కెమిస్ట్రీ హైలైట్?

'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు పొందిన యశ్ హీరోగా, జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్ర నిర్మాణం చివరి దశలో ఉండగా, ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సినిమా నుంచి రెండో పాటను త్వరలో విడుదల చేయనున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, ఈ పాటకు తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా, అర్సాన్ నిజామీ స్వరాలు సమకూర్చగా, ప్రముఖ గాయకుడు సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈ గీతంలో యశ్‌తో కలిసి నటి తారా సుతారియా కనిపించనున్నట్లు టాక్. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, విజువల్స్ కూడా అత్యున్నత స్థాయిలో రూపొందించినట్లు తెలుస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి యశ్ సహ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి నిర్మాణ విలువలు, అంతర్జాతీయ సాంకేతిక నిపుణులతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో యశ్ సరసన రుక్మిణి వసంత్, నయనతార, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తుండగా, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, బాలాజీ మనోహర్, అమిత్ తివారీ, సురజిత్ గోపినాథ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అలాగే అంతర్జాతీయ నటులు డారెల్ డి'సిల్వా, కైల్ పాల్, బీట్రిజ్ టౌఫెన్‌బాచ్ కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. సంగీత దర్శకుడు రవి బస్రూర్‌తో పాటు పలువురు ప్రతిభావంతులైన సంగీతకారులు ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా, త్వరలో విడుదల కానున్న రెండో పాటపై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. భారీ యాక్షన్, భావోద్వేగాలు, అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌తో రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. యశ్ కెరీర్‌లో మరో మైలురాయి చిత్రంగా ఇది నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'ది ఒడిస్సీ'

ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ తెరకెక్కించిన ఈ చిత్రం, హాలీవుడ్ స్టార్ మాట్ డామన్ ప్రధాన పాత్రలో నటించారు. విడుదలైన తొలి వీకెండ్‌లోనే ప్రపంచవ్యాప్తంగా 264 మిలియన్ డాలర్లకు పైగా (దాదాపు రూ.2,548 కోట్లు) గ్రాస్ వసూళ్లు సాధించి సరికొత్త రికార్డుల దిశగా పయనిస్తోంది. భారత్‌లోనూ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభించింది. తొలి రోజే రూ.20.76 కోట్ల గ్రాస్ వసూలు చేసి నోలన్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను మరోసారి నిరూపించింది. ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణతో ఈ సినిమా నోలన్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా నిలిచింది. పురాతన గ్రీకు కవి హోమర్ రచించిన మహాకావ్యం 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని నోలన్ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించారు.


Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277